
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 15 మే 2025



చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.174	260	290
నల్లగొండ	రూ.165	245	270

ఉష్ణోగ్రత: గరిష్ఠం 39.0 కనిష్ఠం 25.2



భువనగిరిలో అందాలభామలు

అందాల భామలే అతిథులుగా



పోచంపల్లిలో మగ్గాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ హనుమంతరావు

చేనేత వర్ధిల్లేలా...

● పోచంపల్లిలో సుందరీమణుల కోసం ఏర్పాట్లు పూర్తి

భూదాన్‌పోచంపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): చేనేత సంస్కృతికి ప్రతీకగా, దేశీయ సాంస్కృతిక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా నిలిచిన భూదాన్‌పోచంపల్లిలో మిస్ వరల్డ్ పోటీదారులు పర్యటించనున్నారు. వీరి పర్యటనతో చేనేత ఇక్కత్ వస్త్రాలకు పుట్టినిల్లయిన పోచంపల్లి మరోసారి మరోమారు ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. ఇందుకోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 25 మంది రెండు బృందాలుగా విడిపోయి వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. మిస్‌వరల్డ్ పోటీదారులు పోచంపల్లిరూరల్ టూరిజం సెంటర్ సందర్శించడం చేనేత ప్రాముఖ్యాన్ని చాటుతోంది. సుందరీమణుల్లో ఓ బృందం చేనేత చీరలకు వాడే నూలు దారం పుట్టుక నుంచి మొదలు మగ్గంపై వస్త్రం తయారీ వరకూ చేనేత ప్రక్రియలను తెలుసుకోనున్నారు. మరో బృందం అదే సమయంలో..

- మిగతా 6వ పేజీలో..

నేడు భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్టను సందర్శించనున్న సుందరీమణులు

ప్రపంచంలోని అందగత్తెలు అతిథులుగా జిల్లాకు వస్తున్నారు. ఇక్కడి చారిత్రక ప్రాంతాలను, భౌగోళిక గుర్తింపు పొందిన విశేషాలను తిలకించనున్నారు. యునెస్కో గుర్తింపు పొందిన పోచంపల్లిని సందర్శించి ఇక్కడి ప్రత్యేకమైన ఇక్కత్ వస్త్రాల తయారీ, చేనేత కార్మికుల జీవన శైలిని తెలుసుకోనున్నారు. వస్త్ర సంప్రదాయాల్లో పేరెన్నికగన్న పోచంపల్లి ఇక్కత్ ఫ్యాషన్ మరోమారు ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. దేశంలోనే ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ఒకటైన యాదగిరిగుట్ట ప్రాశస్త్యాన్ని ముద్దుగుమ్మలకు వివరించనున్నారు. కృష్ణరాతి శిలలతో ఎంతో అందంగా తీర్చిదిద్దిన యాదగిరీశుడి ఆలయాన్ని అందగత్తెలు తిలకించనున్నారు. వీరి రాకతో ప్రపంచ దృష్టి జిల్లాపై పడింది. మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన సుందరీమణులు జిల్లాలో పర్యటించనుండడంతో జిల్లాయంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.



విద్యుద్దీపాల వెలుగుల్లో యాదగిరిగుట్ట

ఆలయ శోభితం తెలిసేలా....

● యాదగిరిగుట్టకు 10 మంది మిస్‌వరల్డ్ పోటీదారులు

యాదగిరిగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు ప్రపంచ ముద్దుగుమ్మలు నేడు రానున్నారు. ఇందుకోసం ఆలయంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇందుకోసం యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రధాన రహదారి, రింగ్‌రోడ్డు, మూడో ఘాట్ రోడ్డు మీదుగా కొండపైకి ట్రయల్ రన్ నిర్వహించారు. కొండపైన అతిథి గృహంలోని గదులకు అవసరం మేర రంగులు వేశారు. కొండకింద వైకుంఠద్వారం నుంచి క్షేత్రమంతా రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. దీంతో ఇల వైకుంఠపురంగా భావించే యాదగిరికొండ కనువిందు చేస్తోంది. కాగా, ఆలయాన్ని వివిధ రకాల పూలు, మామిడి, అరటి తోరణాలతో తీర్చిదిద్దారు. కొండపైన అతిథి గృహానికి చేరుకొని బ్యాటరీ వాహనంలో అఖండ దీపారాదన వద్దకు చేరుకుంటారు. దీపారాధన అనంతరం అక్కడి నుంచి దేశీయ నృత్యాలు, తెలంగాణ సంప్రదాయ ప్రకారం కోలాటాలతో ఆలయ తూర్పు రాజగోపురం వరకు కళాకారులు ...

- మిగతా 6వ పేజీలో..

సీజన్ వచ్చిందంటే చాలు రైతులకు నకిలీల బెడద తప్పడం లేదు. ఆరుగాలం శ్రమించి సాగు చేస్తే తీరా చేతికొస్తుందనుకున్న పంట రాకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దీంతో రైతు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మొదట్లోనే నకిలీ విత్తనాల ఆటకట్టిస్తే పంట చేతికొచ్చి, నష్టాల్లేకుండా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)



నల్లగొండ జిల్లాలో గతంలో పట్టుబడిన నాసిరకం విత్తనాలు(ఫైల్)

రైతులను వేధిస్తోన్న నకిలీల బెడద

- రైతులను నట్టేట ముంచుతున్న నకిలీ విత్తనాలు
- గతంలో పీడీయాక్ట్ అమలు, ఐదు కేసులు నమోదు
- ఏపీలోని సరిహద్దు జిల్లా నుంచి విత్తనాల చేరిక
- నల్లగొండలో కొందరి డీలర్లది ఆడిందే ఆట
- మూడు శాఖలతో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిన యంత్రాంగం

వానాకాలం సీజన్ కంటే ముందే నకిలీ విత్తన ముఠా చేయని ప్రయత్నమంటూ ఉండదు. లూజ్ విత్తనాలను ఆకర్షణీయమైన కవర్లలో ప్యాకింగ్ చేసి రైతులకు తక్కువ ధరలకే అంటగడుతూ నిలువునా మోసం చేయడం దళారులకు అలవాటుగా మారింది. అధికార యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఏదో ఒక చోట పట్టుబడుతూనే ఉన్నాయి. ప్రతీ వానాకాలం సీజన్‌లో నాసిరకం విత్తనాల బెడద రైతాంగానికి పెను సవాల్‌గా మారింది. అసలు ఏదో.. నకిలీది ఏదో.. గుర్తించలేని విధంగా విత్తనాలు మార్కెట్‌లో ఉంటుండటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. ప్రధానంగా వరి, పత్తి విత్తనాలు నాసిరకం కావడంతో రైతులకు నష్టాలు తప్పడంలేదు. తీరా పత్తి పంటలో దిగుబడి రాక రైతులు ఆర్థికంగా దెబ్బతింటుండగా వరిలో సైతం తెగుళ్ల, తాలు, నాణ్యతలేకపోవడంతో రైతులు పంట చేతికొచ్చే సమయంలో లబోదిబోమంటున్నారు. వరి, పత్తి విత్తనాల విషయంలో దళారులదే...

- మిగతా 7వ పేజీలో...

కొందరు ఆడిందే ఆట.. పాడిందే పాట..

జిల్లా కేంద్రమైన నల్లగొండ పట్టణంలో కొందరు డీలర్లది ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రకాశంబజార్, దేవరకొండ రోడ్డు తోపాటు పాత బజార్‌లోని కొందరు డీలర్లు తమకు ప్రజాప్రతినిధుల అండ ఉందని రాజకీయ పార్టీలతో సంబంధాలున్నాయని బాహాటంగా పేర్కొంటూ దందాలకు పాల్పడుతున్నట్లు రైతులనుంచి విమర్శలు వస్తున్నాయి. సీజన్‌లో తమ దుకాణాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేయకుండా ఉండేలా తమకు ప్రజాప్రతినిధుల అండ ఉందని చెబుతుండటం గమనార్హం. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్‌లో పోలీస్, వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు ఉన్నారు. ప్రతీ సీజన్‌కు ముందు టాస్క్‌ఫోర్స్ అధికారులను తప్పుదోవ పట్టించే విధంగా పత్తి విత్తనాలు విక్రయించే రంగంలో ముదిరిపోయిన కొందరు డీలర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈసారైనా టాస్క్‌ఫోర్స్ అధికారులు పత్తి విత్తనాలు విక్రయించే డీలర్లపై నిఘా పెట్టి తనిఖీలు చేస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

సూర్యాపేట జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం దారుణంగా పడిపోయింది. ఎప్పుడు ఊపందుకుంటుందో తెలియని పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా పెద్దసంఖ్యలో రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ఉన్నారు. వీరంతా కమీషన్‌తోనే తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కేవలం పట్టణాల్లోనే కాకుండా మండల కేంద్రాల్లో సైతం భూమి విక్రయించే వారికి, కొనుగోలు దారులకు మధ్యవర్తులుగా ఉంటూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఐదారు నెలల నుంచి వ్యాపారం సాగకపోవడంతో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఇతర ఉద్యోగాలు చేయలేక ఖాళీగా ఉండడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)



రియల్ కష్టాలు

- తగ్గిన క్రయ విక్రయాలతో ఏజెంట్ల అవస్థలు
- జిల్లా కేంద్రంలోనే 300 మందికి పైగా
- సగానికి పైగా రిజిస్ట్రేషన్లు

సూర్యాపేట జిల్లాలో కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్లలో రియల్ వ్యాపారం కొనసాగుతోంది. అన్నిచోట్ల మందకొడిగా కొనసాగుతుండడంతో ఎక్కువ మందికి ఉపాధి కరువైంది. హైడ్రా హైదరాబాద్‌లో అమలుకావడంతో ఆ ప్రభావం జిల్లావ్యాప్తంగా పడింది. ప్రధానంగా చెరువు కింద భూములు కొనేందుకు జంకుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ కేవలం 30 నుంచి 40 శాతం మంది ఉపయోగించుకున్నారు. అనేక కారణాలతో రియల్ ఎస్టేట్ పడిపోయింది. భూముల ధరలు మాత్రం తగ్గలేదు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు మాత్రం భూముల ధరలు తగ్గించి విక్రయిస్తున్నారు.

వ్యాపారం అంతంతే...

సూర్యాపేట జిల్లా కేంద్రం అయినప్పటికీ రియల్ ఎస్టేట్ ఊపందుకోలేదు. సూర్యాపేట పట్టణ జనాభా లక్షా 50వేలు దాటింది. సూర్యాపేట మునిసిపాలిటీలో పలు గ్రామాలు విలీనమయ్యాయి. అయితే...

- మిగతా 7వ పేజీలో...

పెరిగిన ధరలు

సూర్యాపేట మునిసిపాలిటీలో సూర్యాపేట మండలం రాయినిగూడెం, పిల్లలమర్రి, గాంధీనగర్, కుసుమవారిగూడెం, దాసాయిగూడెం, చివ్వెంల మండలంలోని కుడకుడ, దురాజ్‌పల్లి, ఖాశీంపేట, బీబీగూడెం గ్రామాలు విలీనమయ్యాయి. అయితే పెరిగిన ధరలతో ఎక్కడా కూడా సామాన్యులు భూములు కొనుగోలు చేయలేకపోతున్నారు. సూర్యాపేట సమీపంలో ఐదు కిలోమీటర్ల లోపు ఎకరం భూమి రూ.2 కోట్ల దాకా ధర పలుకుతుండడంతో రియల్టర్లు కూడా ఆసక్తి చూపడంలేదు. ఎకరం స్థలంలో వెంచర్ చేయాలంటే కనీసం 1,200 చదరపు గజాలు రోడ్ల కోసం వదిలిపెట్టాలి. అంతేకాక భూమిలో 10శాతం మునిసిపాలిటీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలి. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలంటే భూమి ధరలో 10 శాతం రెవెన్యూ శాఖకు నాలా పన్నుల రూపంలో చెల్లించాలి. ఇవన్నీ అనుమతులు తీసుకున్న తర్వాత వెంచర్లు చేయాల్సి ఉంటుంది. అయితే భూమి యజమానులు అధిక ధరలు చెబుతుండడంతో వెంచర్లు చేసే వారు కూడా ముందుకు రావడంలేదు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో 'నల్లగొండ పబ్లిక్ స్కూల్' ప్రభంజనం



మోక్షసాయి సంజన

నల్లగొండటౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో నల్లగొండ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన మోక్ష సాయిసంజన 500 మార్కులకు గాను 489 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచారు. అదేవిధంగా ఆమని మ్యాథమెటిక్స్‌లో వందకు వంద మార్కులు సాధించగా ఐటీలో ఏడుగురు విద్యార్థులు 100మార్కులు సాధించారు. మొత్తం 75 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 90 శాతం 16 మంది విద్యార్థులు, 80 శాతానికి పైగా 17 మంది విద్యార్థులు, 70శాతానికి పైగా 26 మంది విద్యార్థులు, మిగతా విద్యార్థులు 60 శాతానికి పైగా మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పార్థసారథి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ జగని భీమయ్య, సెక్రెటరీ డి.అమరేందర్‌రావు, కోశాధికారి పి. వెంకటరమణ అభినందించారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

● అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్



నారమ్మగూడెంలో వివరాలు సేకరిస్తున్న రాజ్‌కుమార్

నిడమనూరు, మే 14(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు అదనపు కలెక్టర్, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్ తెలిపారు. నిడమనూరు మండలంలోని నారమ్మగూడెం గ్రామంలో మొదటి విడతగా 55 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్ అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించి విచారణ చేశారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారి స్థితిగతులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హుల పేర్లు ఉంటే తొలగించి అర్హులను ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీవో బోనగిరి రమేష్, ఎంపీవో కేదార్‌నాథ్, పీఆర్ ఏఈ సాయిప్రసాద్, ఆర్‌ఐలు దాడి రాజిరెడ్డి, సందీప్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అదనపు గదులతో అన్ని సౌకర్యాలు

● కలెక్టర్ ఇలా త్రిపాఠి ● కలెక్టరేట్‌లో అదనపు బ్లాక్ నిర్మాణానికి భూమి పూజ ● నార్కట్‌పల్లి మండలంలో సుడిగాలి పర్యటన

నల్లగొండటౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో నూతనంగా నిర్మించే అదనపు బ్లాక్ ఏర్పాటుతో అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో చేపట్టనున్న అదనపు బ్లాక్ నిర్మాణ పనులకు బుధవారం ఆమె భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవనాలను నిర్మించారు. జిల్లాలో మాత్రం గతంలో నిర్మించిన పాత భవనంలోనే జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు, పలు జిల్లా అధికారుల కార్యాలయాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కలెక్టర్ కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరం కేవలం 250 సీట్ల సామర్థ్యంతో ఉన్నందున తరచూ నిర్వహించే పెద్ద పెద్ద సమావేశాలు, సమీక్షా సమావేశాలకు ఇబ్బంది పడాల్సి వస్తుందని అన్నారు. అంతేకాక డీఎంహెచ్‌వో, డీఈవో వంటి మరికొన్ని కార్యాలయాలు పట్టణంలో వేర్వేరు చోట ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన అదనపు బ్లాకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. అదనపు గదుల నిర్మాణంతో ఉద్యోగులకు అన్ని వసతులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ బ్లాకులో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎలివేషన్, అత్యాధునిక డిజైన్లతో భవనాన్ని నిర్మించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. నూతన అదనపు బ్లాకు భవన నిర్మాణాన్ని 8 నుంచి పది నెలల వ్యవధిలో పూర్తి చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి, సూపరింటిండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్లు ఫణీజా, గణేష్, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి వై.అశోక్‌రెడ్డి, డీపీవో వెంకయ్య, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అదనపు గదుల నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్

ట్రక్ షీట్లను తనిఖీ చేసిన కలెక్టర్ త్రిపాఠి

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక పర్యటన చేశారు. మండలంలోని బీ.వెల్లెంలలోని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోలు తరలింపు రికార్డులు, ట్రక్ షీట్లను ఆమె తనిఖీ చేశారు. నాలుగు రోజుల్లోగా కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని పూర్తిగా తరలించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్‌ను ఆదేశించారు. అనంతరం పక్కనే ఉన్న డబుల్ బెడ్‌రూంల సముదాయాన్ని పరిశీలించారు. రానున్న 15రోజుల్లో మౌలిక వసతులతో పాటు అసంపూర్తి పనులను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేసి ఆస్పత్రి నిర్వహణ రికార్డులను పరిశీలించారు. హాజరు పట్టికను పరిశీలించి పేరుపేరునా సిబ్బందిని పిలిచారు. అనంతరం ఆరోగ్యకేంద్రంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా మెడికల్ ఆఫీసర్ విజయ్ కుమార్‌ను అడిగారు. సిబ్బందికి టాయ్‌లెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని, పీహెచ్‌సీకి వచ్చే రోగులు వేచి ఉండి కూర్చోవటానికి బెంచీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు స్పందించిన కలెక్టర్ త్రిపాఠి తన కోటా నిధుల నుంచి వాటిని సమకూరుస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్, నల్లగొండ ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, సివిల్ సప్లై డీఎం, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

● బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న రవీంద్రకుమార్

డిండి, చింతపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. డిండి మండలంలోని గోనబోయినపల్లి, టి.గౌరారం, తవక్లాపూర్, డిండి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే కొనే దిక్కులేదని విమర్శించారు. లారీల కొరత కారణంగా ఒక టి.గౌరారం కేంద్రంలోనే సుమారు 40లారీల వరిధాన్యం నిల్వలు పేరుకుపోయాయని అన్నారు. లారీలు రాకపోవడంతో రైతులు తమ సొంత ఖర్చులతో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారని అన్నారు. బస్తాకు 2 నుంచి 3 కిలోలు తరుగు తీస్తూ రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్, మే 14: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో ఆయన అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



భువనగిరిలోని వివేరా హోటల్‌లో జిల్లా యంత్రాంగం, వివేరా హోటల్ నిర్వాహకులతో ప్రపంచ సుందరీమణులు





అందాల భామలే... అతిథులుగా..

చేనేత వర్థిల్లేలా...

- సాయంత్రం ఆరు గంటలకు రాక
- ముస్తాబైన టూరిజం పార్క్
- ఇక్కత్ వస్త్రాల ప్రదర్శన
- ప్రపంచ గుర్తింపునకు మరో ప్రయత్నం
- కంట్రీయార్డ్‌లో మెహిందీతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తారు..
- చేనేత థీమ్‌పై ప్రత్యేక ప్రదర్శనలు

(5వ పేజీ తరువాయి): ప్రపంచ సుందరీమణుల సందర్శన కోసం పూర్తిగా గ్రామీణ వాతావరణం కల్పించేందుకు టూరిజం పార్క్‌ను ముస్తాబు చేస్తున్నారు. హ్యాంపీ థియేటర్‌లో చేనేత వస్త్రాల ప్రదర్శనను ఏర్పాటుచేశారు. ఇందులో సిద్ధిపేట జిల్లాకు చెందిన గొల్లబామ చీరలు, నారాయణపేట, గద్వాల చీరలు, పోచంపల్లి ఇక్కత్, పుట్టపాక తెలియా రుమాళ్లు, సిల్కు, కాటన్ చీరలు, డ్రెస్ మెటీరియల్, బెడ్‌షీట్లు, రజాయ్ (క్విల్ట్స్), స్టోల్స్, స్కార్ఫ్స్ దుప్పట్టా, టేబుల్ కర్టెన్స్ పిల్లో కవర్స్ తదితర వెరైటీలను ప్రదర్శించున్నారు. కొన్ని వస్త్రాలను స్థానిక మహిళలు ధరిస్తారు. వీటిని రెండు బృందాల్లోని సుందరీమణులు సందర్శిస్తారు.

ఇక్కత్ వస్త్రాలతో ఫ్యాషన్ షో...

ప్రపంచ సుందరీమణులకు పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల విశిష్టతను తెలియజేసే కార్యక్రమాలను హ్యాంపీ థియేటర్‌లో ఏర్పాటు చేశారు. సాంప్రదాయంగా వచ్చిన వస్త్రాలను ఆధునిక ఫ్యాషన్ డిజైనర్‌లతో కొత్త రకంగా వస్త్రాలను రూపొందించి ప్రపంచ సుందరాంగుల ముందు ఫ్యాషన్ షో ప్రదర్శిస్తారు. ఇదే సందర్భంలో ఇక్కత్ వస్త్రాల ప్రాముఖ్యత, విశిష్టతను కార్మికుల ముఖాముఖి ద్వారా సుందరీమణులు తెలుసుకోనున్నారు. తెలంగాణ టూరిజం ప్రాముఖ్యాన్ని తెలిపేలా టూరిజం శాఖ వారు వీడియోలను ప్రదర్శించనున్నారు.

చేనేతకు మరింత ప్రాచుర్యం...

చేనేత వస్త్రాలను ప్రపంచ స్థాయికి పరిచయం చేయడమే ప్రథమ లక్ష్యంగా మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే అందగత్తెల ముందు ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరికి ఇక్కత్ వస్త్రాల విశిష్టతను తెలియజేయడం వల్ల స్థానిక చేనేత కళాకారులకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు లభిస్తుందని భావిస్తున్నారు. తద్వారా అంతర్జాతీయ స్థాయిలో చేనేత ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి చేనేత కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే యునెస్కో గుర్తింపు పొందిన పోచంపల్లి ప్రాంతాన్ని ప్రపంచ ఉత్తమ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే ప్రయత్నం సాగుతోంది. ఈ సందర్భంలో సుందరీమణుల రాక పర్యాటకంగానూ మరింత ప్రోత్సాహాన్ని తేనుంది.

టూరిజం పార్క్ ముస్తాబు...

సుందరీమణులు సందర్శించే పోచంపల్లి టూరిజం సెంటర్‌ను అన్నిఏర్పాట్లతో ముస్తాబుచేశారు. రాష్ట్ర గ్రామీణ వాతావరణం కనిపించేలా జాజు రంగులో గోడలను, వాటిపై ముగ్గులతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆకట్టుకునే ఒక ప్రత్యేక వాతావరణం కనిపించేలా విద్యుత్ కాంతుల మధ్య పార్క్‌ను అలంకరించారు. అదేవిధంగా పట్టణంలోని డివైడర్ల మధ్యలో విద్యుత్ స్తంభాలు జాతీయ జెండాలోని రంగుల లైట్లతో వెలిగిపోతున్నాయి. ఈ పర్యటన విజయవంతం కోసం సుమారు 1000 మందితో పటిష్ఠ బందోబస్తు చేపట్టారు. సాయంత్రం 6 గంటల నుంచి మొదలయ్యే కార్యక్రమం రాత్రి 10.30 గంటలకు పూర్తవుతందని అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు.

చేనేతలో వినూత్న డిజైన్లు ...



మా కృషి, దృష్టి అంతా డిజైన్లు, డైయింగ్, టైయింగ్, మోటిఫ్స్ షేడ్స్, వీవింగ్ పైనే ఉంటుంది. నచ్చిన డిజైన్లకు ఎక్కువ మొత్తంలో కోరితే డిమాండ్‌ను తగ్గట్టు తయారు చేస్తుంటాం. సాంప్రదాయ ఏనుగులు, పక్షులు మాత్రమే కాకుండా మార్కెట్ ట్రెండ్‌ను అనుసరించి డిజైన్స్ చేస్తున్నాం. రాజకీయ నాయకులు, ప్రముఖులు మా వద్ద నుంచి చీరలు తీసుకెళ్తున్నారు. బాలీవుడ్ నటి జయాబచ్చన్, ఇన్ఫోసిస్ సుధామూర్తికి కూడా మా చీరలు వెళ్లాయి. జాతీయస్థాయిలో మా డిజైన్లకు గుర్తింపు రావాలని మేము సాధన చేస్తున్నాం.

– బోగ సరస్వతి, స్టేట్ అవార్డు గ్రహీత, భూదాన్‌పోచంపల్లి



ఆలయం శోభితం తెలిసేలా....

ఆలయాల సంస్కృతీ, సాంప్రదాయాలు తెలిసేలా కార్యక్రమాలు

(5వ పేజీ తరువాయి): స్వాగతం పలుకగా వారు ఆలయం వద్దకు చేరుకునేందుకు ఎర్ర తివాచీ పరచనున్నారు. అక్కడి నుంచి స్వర్ణ దివ్య విమాన రాజగోపురం దర్శించుకొ ని త్రితల రాజగోపురం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి దారిలో క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామిని దర్శించుకొని నేరుగా ధ్వజస్థంభానికి మొక్కులు తీర్చుకుంటారు. అక్కడి నుంచి అంతరాలయంలోని స్వయంభువులను దర్శించుకున్న అనంతరం ఉపాలయాల్లోని ఆండాళ్ల అమ్మవారు, ఆళ్వార్ల ను దర్శించుకుంటారు. గర్భాలయానికి అభిముఖంగా వేద పండితుల వేద ఆశీర్వచనం చేస్తారు. తర్వాత ఆలయ అందాలు, లోపలి ప్రాకార మండపాలు వీక్షిస్తూ పశ్చిమ రాజగోపురం ద్వారా ఆలయం వెలుపలికి వచ్చి ఉత్తర, తూర్పు దిక్కుల్లో బయటి ప్రాకార మండపాలు, ఏనుగుల విగ్రహాలు, యాలీ పిల్లర్లను తిలకిస్తారు. అనంతరం తిరువీధి నుంచి బ్యాటరీ వాహనాల్లో అతిథి గృహానికి చేరుకొని అక్కడి నుంచి తిరుగుపయణమవుతారు. ఈశాన్య దిక్కు లో ప్రెస్ గ్యాలరీ, బ్రహ్మోత్సవ మండపం వద్ద ఫొటోషూట్ కోసం వేదికను ఏర్పా టు చేశారు. దేవాదాయ శాఖ డైరెక్టర్, ఈవో ఎస్. వెంకట్రావు సరస్వతి పుష్కరాల కోసం కాళేశ్వరంలో ఏర్పాట్లను చేసేందుకు ప్రభుత్వం ఆదేశించగా అందాల భామల పర్యటనను విజయవంతం చేసేందుకు కలెక్టర్ ఎం.హనుమంతరావు ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరం మేరకు జిల్లా యంత్రాంగంతో పాటు ఆలయ అధికారులను కూడా పురమాయిస్తున్నారు. నేరుగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూనే జిల్లాలో పర్యటించే సమయంలో వాట్సాప్, ఫోన్ ద్వారా తగు సలహాలు, సూచనలు చేశారు. ప్రపంచ స్థాయిలో అంతర్జాతీయ స్థాయి క్షేత్రంగా యాదగిరిగుట్ట ప్రసిద్ధి చెందేందుకు చొరవ తీసుకున్నారు. అందాల పోటీదారులకు సంస్కృతీ, సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికేందుకు ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

భద్రత వలయంలో ఆలయం



మిస్ వరల్డ్ పోటీదారుల పర్యటన నేపథ్యంలో ఆలయంలో భద్రతను ముమ్మరం చేశారు. వివిధ దేశాలకు చెందిన సుందరీమణులకు పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కొండపైన 300 మంది, కొండకింద 200 మంది పోలీసులు బందోబస్తు చేపట్టనున్నట్లు డీసీపీ ఆకాంక్ష్‌యాదవ్ తెలిపారు. అదేవిధంగా కొండపైన 43ఎస్పీఎఫ్, 23హోంగార్డు, 33సురక్ష సిబ్బందిచే భద్రత నిర్వహిస్తున్నట్లు ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు తెలిపారు.

● భువనగిరిలో అందాల భామల సందడి

తెలంగాణ రాష్ట్రంలో వరుస పర్యటనల్లో ఉన్న మిస్‌వరల్డ్ పోటీదారులు బుధవారం వరంగల్‌లో పర్యటకు వెళ్లారు. హైదరాబాద్ నుంచి బస్సుల్లో బయలుదేరిన ప్రపంచ సుందరీమణులు భువనగిరిలో సందడి చేశారు.భువనగిరి బైపాస్‌లోని వివేరా హోటల్‌లో మధ్యాహ్న భోజనం చేశారు. అందాల బామలకు రాచకొండ సీపీ సుధీర్‌బాబు, డీసీపీ అక్షాంశ్‌యాదవ్, ఆర్డీవో కృష్ణారెడ్డి, హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, తదితరులు స్వాగతం పలికారు. రెండువిడతలుగా 20మంది చొప్పున మొత్తం 40మంది భామలు వివేరాకు చేరుకోగా, వీరికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక వంటకాలు సిద్ధం చేయించింది. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పదార్థాలను పరిశీలించిన అనంతరం వారికి కమ్మని వంటకాలతో భోజనం చేయించారు. హోటల్ నిర్వాహకులతో పాటు సిబ్బందితో కలివిడిగా ఉంటూ ఫొటోలు దిగారు. పలువురు అధికారులు అందాలభామలతో సెల్ఫీలు దిగారు.



దేశభక్తిని చాటేలా వినూత్న డిజైన్లు

మా వారు బోగ బాలయ్య 50 ఏళ్లగా, నేను 25 ఏళ్లగా చేనేత వస్త్రాలను నేస్తున్నాం. కొత్త కొత్త డిజైన్లను తయారు చేస్తున్నాం. ముఖ్యంగా యువతను దృష్టిలో పెట్టుకుని వారి అభిరుచులకు అనుగుణంగా ఆధునిక వస్త్రాలను హుందాగా ఉండేట్లు డిజైన్లు రూపకల్పన చేస్తున్నాం. ఇటీవల ఆజాదీకా అమృత మహోత్సవాలను పురస్కరించుకుని దేశభక్తి చాటేలా 'ఇండియా మ్యాప్ మధ్యన చరఖా రాట్నం' వచ్చేలా స్కార్ఫ్ నేశాం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కానుకగా సమర్పించాం. ఇందులో ఎకో ఫ్రెండ్లీ రంగులను ఉపయోగించాం. 121 రంగుల్లో 121 మోటిఫ్స్‌తో చీర తయారు చేశాం. 2021లో 100 అడ్డ చిటికీలు, 100 నిలువు చిటికీలు రూపొందించి 100/100 అంటే 10,000 షేడ్స్ వచ్చేలా చీరలు రూపొందించాం. ఆ కృషికి గుర్తింపుగా రాష్ట్ర అవార్డు వరించింది. బెస్ట్ వీవర్ అప్రిషియేషన్, బెస్ట్ వీవర్ అవార్డు సర్టిఫికెట్ లభించింది. మహిళా దినోత్సవం సందర్భంగా బెస్ట్ వీవర్‌గా ప్రశంసలు అందుకున్నాం.

చేనేతలో పదివేల వర్ణాల కలబోతతో బోగ సరస్వతి బాలయ్య రూపొందించిన పోచంపల్లి డబుల్ ఇక్కత్ చీర

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి దివ్యక్షేత్రంలో గురువారం నిత్యకైంకర్యాలు అత్యంతవైభవంగా నిర్వహించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో అలంకరించి గజవాహన సేవలో తీర్చిదిద్దారు. వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమపూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు జరిగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం నిర్వహించారు.



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

ప్రపంచం దృష్టికి పోచంపల్లి ఇక్కత్ చీరల ఖ్యాతి

భూదాన్‌పోచంపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ సుందరీమణుల సందర్శనతో పోచంపల్లి ఇక్కత్ చేనేత చీరల ఖ్యాతిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం తెలంగాణకు దక్కిందని యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఈ నెల 15న ఆఫ్రికన్ దేశాలకు చెందిన 25 మంది సుందరీమణులు భూదాన్‌పోచంపల్లి సందర్శిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను, ట్రయల్ రన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరీమణులను సాదరంగా ఆహ్వానించేందుకు స్వాగత కార్యక్రమంగా కోలాటాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సంస్కృతీ, సాంప్రదాయంగా నుదుట తిలకం దిద్ది ఆశీర్వదించే కార్యక్రమాలు ఉంటాయన్నారు. మ్యూజియంలో చేనేత వస్త్ర ప్రాముఖ్యాన్ని కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శింపచేసేందుకు విలువైన సమాచారంతోపాటు ఏర్పాటు చేసిన చిత్రపటాలు ప్రదర్శింప చేస్తామన్నారు. అదేవిధంగా చేనేత మగ్గం తీరును సుందరీమణులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు రెండు మగ్గాలను లైవ్ డెమానిస్ట్రేషన్‌కోసం ఏర్పాటుచేశామన్నారు. మ్యూజియం అంతా పచ్చదనంతో ఆహ్లాదంగా ఉండేట్లు అలంకరింపచేశామన్నారు. అనంతరం హ్యాంపీ థియేటర్‌ను సందర్శించి,సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఏర్పాట్లు ఆయన పరిశీలించారు. అందాలభామల స్వాగతించే విధానాన్ని పోలీస్ శాఖ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. కార్యక్రమంలో రాచకొండ డీసీపీ అక్షాంష్‌యాదవ్, యాదాద్రిభువనగిరి జిల్లా జడ్పీ సీఈవో శోభారాణి, టూరిజం జీఎం ఉపేందర్‌రెడ్డి, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ఏడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఏర్పాట్లపై కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులతో చర్చించారు. ఆయన వెంట రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తడక వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, నాయకులు తడక రమేష్ తదితరులున్నారు.



టూరిజం పార్క్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీపీ అక్షాంష్‌యాదవ్

అవాంతరాలు లేకుండా ఏర్పాట్లు

యాదగిరిగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ సుందరీమణుల పోటీల్లో పాల్గొనే అందాలభామల పర్యటనలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు. యాదగిరిగుట్టపై బుధవారం ఏర్పాట్లపై సమీక్షించి, మాట్లాడారు. ఎలాంటి అవాంతరాలు కలగకుండా అవసరమగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ డీఈవో దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈవోలు గజవెల్లి రఘు, పర్యవేక్షకుడు రాజన్‌బాబు, సివిల్ ఈఈ జెల్లెల దయాకర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు రామారావు,ఎస్పీఎఫ్ సీఐ శేషగిరిరావు ఉన్నారు.

క్రీడా శిక్షణ.. జోరుగా సాధన

ఇన్నాళ్లూ స్కూళ్లు, ట్యూషన్లు, హోంవర్క్‌లతో కుస్తీపట్టిన విద్యార్థులకు వేసవి సెలవులు వచ్చేశాయి. వారు ఇంట్లో ఉంటూ సెల్‌ఫోన్, టీవీ చూస్తూ గడుపుతూ అల్లరి చేయకుండా తల్లిదండ్రులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. వేసవి సెలవులను వృథా చేయకుండా సామర్థ్యాలు, సృజనాత్మకత, నైపుణ్యాలు పెంచే విధంగా ఆలోచిస్తున్నారు. అదే తోవలో పోలీస్‌శాఖ ఉద్యోగులు, కానిస్టేబుళ్ల పిల్లలు కోసం ప్రత్యేకంగా క్రీడా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఈ ఏడాది తొలిసారి జిల్లాకేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ మైదానంలో మెగా సమ్మర్ క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.

– ఆంధ్రజ్యోతి నల్లగొండ స్పోర్ట్స్

- పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నల్లగొండలో శిక్షణ శిబిరం
- సామర్థ్యాలు, సృజనాత్మకత, నైపుణ్యాల పెంపే లక్ష్యం
- ఉల్లాసంగా గడుపుతున్న బాల బాలికలు
- ఉదయం, సాయంత్రం క్రీడల్లో మెలకువలు



పోలీస్‌శాఖ చొరవ..

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరంలో వాలీబాల్, కరాటే, యోగా వంటి క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 6.30గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. ఉదయం వేళలో యోగా, కరాటే శిక్షణ పొందుతుండగా, సాయంత్రం కేవలం వాలీబాల్ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు(వాలీబాల్), వంశీ(కరాటే), కిషన్‌కుమార్ మాస్టర్(యోగా)లో శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ఈ శిక్షణ శిబిరం కొనసాగుతుందని కోచ్‌లు తెలిపారు. మొత్తం 60మంది బాల, బాలికలు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో కరాటే, యోగా, వాలీబాల్ క్రీడల్లో తర్ఫీదు పొందుతున్నారు. శిక్షణ పొందుతున్న బాల, బాలికలకు ఉదయం అరటి పండ్లు, సాయంత్రం బట్టర్ మిల్క్ అందజేస్తున్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగుతోంది.

ఆట మానసికానందాన్ని కలిగిస్తుంది



ఆటలతో మానసిక ఆనందం, శారీరక దృఢత్వం పెరుగుతుంది. ఐదు రోజుల నుంచి వాలీబాల్ నేర్చుకుంటున్నా. పీడీ నాగరాజ్ ఆధ్వర్యంలో అప్పర్ హ్యాండ్, లోయర్ హ్యాండ్, సర్వీసింగ్ తదితర భాగాల్లో శిక్షణ ఇస్తున్నారు. వాలీబాల్ ఆడుతుంటే ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఉంది.

– వేముల నాగకృష్ణ సాయికుమార్ 10 వతరగతి, నల్లగొండ.

వాలీబాల్‌పై ఆసక్తితో..



నేను నల్లగొండ పద్మానగర్‌లోని మిర్యాల కమలమ్మ వెంకటేశం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న. వాలీబాల్‌పై ఉన్న ఆసక్తితో ఈ శిబిరంలో చేరి వాలీబాల్ క్రీడపై తరఫున పొందుతున్న ఐదు రోజుల నుంచి శిక్షణ నేర్చుకుంటున్న. పాఠశాల స్థాయిలో నిర్వహించిన రన్నింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి పొందా. నేను ఐఏఎస్ సాధించాలనేది నా ఆశయం.

– లక్ష్మిప్రసన్న 8 వ తరగతి, నల్లగొండ.

యోగాతో జ్ఞాపకశక్తి పెరుగుతుంది



యోగా ఆసనాలు నేర్చుకోవడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మాస్టర్ కిషన్ కుమార్ ఆధ్వర్యంలో ఆరు రోజుల నుంచి వృక్షాసనంతో పాటు ఇతర ఆసనాలు కూడా నేర్చుకుంటున్న. పాఠశాల స్థాయిలో ఇప్పటికే డ్యాన్స్ నేర్చుకున్న. యోగా నేర్చుకుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

– రామావత్ మనుస్రశ్రీ, 5వ తరగతి, నల్లగొండ.

సంతోషంగా ఉంది



నేను ఏడు రోజుల నుంచి ఈ శిబిరంలో పాల్గొని తోటి స్నేహితులతో కలిసి కరాటే నేర్చుకోవడం చాలా సంతోషంగా ఉంది. కరాటే నేర్చుకోవడం వల్ల భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయి. ఆత్మ రక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని మా ఉపాధ్యాయులు తెలిపారు. అందుకే ఈ శిబిరంలో చేరి కరాటే నేర్చుకుంటున్నా.

– రణవీర్ 5వ తరగతి, నల్లగొండ.

వాలీబాల్ శిక్షణ ఇస్తున్నా



ఎస్పీ ఆధ్వర్యంలో ఈ ఏడాది మెగా సమ్మర్ స్పెషల్ క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 60 మంది పోలీసు ఉద్యోగులు, కానిస్టేబుల్ పిల్లలు వాలీబాల్ క్రీడలో చురుకుగా శిక్షణ పొందుతున్నారు. వీరందరికీ వాలీబాల్ క్రీడా నైపుణ్యాలను నేర్పిస్తున్నాను. ప్రతిరోజూ సాయంత్రం 4.30గంటల నుంచి 6.30 గంటల వరకు శిక్షణ సాగుతుంది.

– పీడీ నాగరాజు

యోగా సంపూర్ణ ఆరోగ్యానిస్తుంది



యోగా నేర్చుకోవడం వల్ల మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారు. ప్రపంచ దేశాలు సైతం యోగాను నిత్యజీవితంలో అనుసరిస్తున్నారు. పోలీస్ హెడ్ క్వార్టర్‌లో నిర్వహించే ఉచిత యోగా శిక్షణ శిబిరంలో 60మంది బాలబాలికలు పాల్గొని ఉదయం సాధన చేస్తున్నారు. శిక్షకునిగా అవకాశం కల్పించిన ఎస్పీకి ప్రత్యేక కృతజ్ఞతలు.

– కిషన్‌కుమార్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, యోగా గురువు.

వేధిస్తోన్న.. నకిలీల బెడద

(5వ పేజీ తరువాయి)

పెత్తనమైంది. గ్రామీణ ప్రాంతాల్లో దళారులు రైతులను మచ్చిక చేసుకుని తక్కువ ధర, అధిక దిగుబడులు, తక్కువ సమయంలో పంట చేతికి వస్తుందని నమ్మించి నాసిరకం విత్తనాలు అంటకడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నా దళారుల దందాను నిలువరించలేక పోతున్నారు. గత ఏడాది మే రెండోవారంలో నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మునుగోడు నియోజకవర్గంలోని చండూరు, మర్రిగూడ మండలాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో పలుచోట్ల ఐదు కేసులను కూడా నమోదు చేసిన సందర్భాలున్నాయి. ఒకానొక దశలో పీడీ యాక్టును కూడా అమలు చేశారు. అయినప్పటికీ విత్తనాల నాణ్యతపై పలు అనుమానాలు వ్యక్తమవుతూ వస్తున్నాయి. పెట్టుబడులు చేతిలో లేని రైతులు తక్కువ ధరకు వచ్చే విత్తనాలను తీసుకుని వేసిన సందర్భాలూ ఉన్నాయి. దీంతోనే రైతులు నష్టపోతున్నారు. తాజాగా జిల్లా ఉన్నతాధికారులు టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీచేశారు. వ్యవసాయ శాఖతోపాటు పోలీస్‌శాఖ, రెవెన్యూశాఖ సమన్వయంతో పలు టీంలు ఏర్పడి తనిఖీలు విస్తృతంగా చేయాలని నిర్ణయించాయి. అయితే ప్రతీ సంవత్సరం ఈవిధంగా తనిఖీలు చేస్తున్నా, ఎక్కడో ఒక చోట నకిలీ విత్తనాల బెడద తప్పడం లేదు. నల్లగొండ జిల్లాలోనే గతంలో లూజు పత్తి విత్తనాలు పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

ఉమ్మడి జిల్లాలో 21.50లక్షల ఎకరాల్లో పంటల సాగు

ఈ నెల నాలుగో వారం నుంచి వ్యవసాయ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా అకాల వర్షాలకు దుక్కులను దున్నకుని సిద్ధం చేసుకున్నారు. ఈ నెలాఖరులోనే నైరుతి రుతుపవనాలు కేరళను తాకడంతోపాటు తెలంగాణలో సైతం ముందుగానే వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వర్షాలు కురిస్తే ముందుగానే విత్తనాలు వేస్తారు. ఈ నెల చివర్లో రోహిణి కార్తె ప్రారంభంకానుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరితోపాటు పత్తి అంతా కలిపి 21.50లక్షల ఎకరాల్లో పంటలు సాగు కానున్నాయి. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 5.40లక్షల ఎకరాల్లో పత్తి సాగు కానుండగా ఇందుకు సంబంధించి 13.60లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం ఉంటాయి. యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో వరి అత్యధికంగా సాగు కానుండగా పత్తి సుమారు 3లక్షల మేర సాగు కానుంది. అంటే ఈ రెండు జిల్లాలో దాదాపు 9లక్షలకు పైగా పత్తి విత్తన ప్యాకెట్లను వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. ఇక వరికి సంబంధించి విత్తనాలు దాదాపు 2.4లక్షల క్వింటాళ్లకు పైగా విత్తనాలు అవసరం ఉంటుంది.

భూత్‌పూర్, మాచర్ల నుంచి నిషేధిత బీటీ-3 విత్తనాలు

అమెరికా దేశంలోని శాన్‌శాంటోను కంపెనీకి చెంది బీటీ-3 రకం విత్తనాలపై దేశవ్యాప్తంగా నిషేదం ఉంది. బీటీ-3 విత్తనాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేదు. బీటీ-1, బీటీ-2 రకాలకు మాత్రమే అనుమతి ఉంది. దాదాపు 20 ప్రధాన కంపెనీలకు చెందిన అనుమతిగల విత్తనాలను అందుబాటులో ఉంచారు. ఇకపోతే నిషేధిత విత్తనాలవల్ల కాలుష్యంతో ముప్పు వాటిల్లే అవకాశంతోపాటు అనేక రకాలుగా నష్టాలున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా పత్తి జిన్నింగ్ మిల్లులు ఉండటంతో విత్తనోత్పత్తి సులువుగా జరుగుతుంది. అయితే భూత్‌పూర్ నుంచి వచ్చే అన్ని రకాల విత్తనాలు నష్టం కలిగించనప్పటికీ దళారుల జోక్యంతో బీటీ-2 రకం విత్తనాల పేరిట బీటీ-3 రకం విత్తనాలను అంటగడుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి సైతం వచ్చినట్లు సమాచారం. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల నుంచి సైతం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నాసిరకం విత్తనాలతోపాటు బీటీ-3 రకం విత్తనాలు కూడా చేరుతున్నట్లు తెలుస్తోంది. నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ సరిహద్దులోనే మాచర్ల ఉండటంతో సులువుగా వివిధ మార్గాల్లో నకిలీ పత్తి విత్తనాలు చేరుతున్నాయి. వాస్తవానికి అయితే చాలామంది డీలర్లు, వ్యాపారులు రైతులు పత్తి, వరి విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే వారికి బిల్లు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ చాలాచోట్ల రశీదు ఇవ్వకుండా రైతులను మభ్య పెట్టి పంపించి వేస్తున్నా సంఘటనలున్నాయి. పంట దిగుబడులు తక్కువగా వచ్చినప్పుడు రైతులు నిలదీస్తారన్న భయంతో ఏ వ్యాపారి కూడా బిల్లులు ఇవ్వడం లేదు. ఒక ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక, ఛత్తీస్‌గఢ్, గుజరాత్‌ల నుంచి కూడా వివిధ ప్రాంతాల నుంచి రాష్ట్రంలోకి ఆ తర్వాత నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు చేరుతుండటం గమనార్హం. రోడ్డుమార్గం ద్వారా పట్టుబడుతామన్నా ఆలోచనతో కొంత మంది దళారులు రైళ్లలో తరలించడం, లేదంటే ట్రాన్స్‌ఫోర్ట్ వాహనంలో జిల్లాకు చేరవేస్తున్నారు. ఒరిజినల్ కంపెనీలకు చెందిన ప్యాకెట్ల మాదిరిగానే నకిలీ ప్యాకెట్లు తయారుచేసి అందులో నాసిరకమైన పత్తి విత్తనాలను నింపి రైతులకు అంటగట్టే ప్రమాదం ఉంది. ఈనేపథ్యంలో గత సంవత్సరం వ్యవసాయ శాఖ అధికారులు వరితోపాటు పత్తి విత్తనాలకు సంబంధించిన నమునాలను సేకరించి రాజేంద్ర నగర్ ల్యాబ్‌కు పంపించారు. కొంతమంది మధ్య దళారులు మూడు జిల్లాలనుంచి పత్తి వేసే రైతులను భూత్‌పూర్‌కు తీసుకవెళ్లి నాసిరకం విత్తనాలు అంటగట్టడంతోపాటు వారు డిస్కౌంట్ ఇస్తున్న మాదిరిగా వ్యవహరించి భోజనాల ఖర్చులు ఇవ్వడం, రానుబోను వాహన చార్జీలు ఇచ్చి మభ్యపెట్టి మోసం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. 10మంది చొప్పున రైతులను ఒక జట్టుగా తయారై ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో భూత్‌పూర్, మాచర్లతోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లి దళారుల మాటలు నమ్మి నష్టపోయిన సంఘటనలు కొకొల్లలు ఉన్నాయి.

రైతులు రశీదులను తప్పనిసరిగా తీసుకోవాలి



ప్రతీ రైతు కూడా విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ఇతర ప్రాంతాల నుంచి బీటీ-2 విత్తనాల పేరిట బీటీ-3 విత్తనాలను అంటగట్టే ప్రమాదం ఉంది. బీటీ-3ని కేంద్రం నిషేదించింది. రైతులు పూర్తిస్థాయిలో అనుమతులున్నా డీలర్లు, వ్యాపారుల వద్దే విత్తనాలను కొనుగోలు చేసి రశీదులు తీసుకోవాలి. నాణ్యమైన విత్తనాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నాం. లైసెన్స్ ఉన్న డీలర్లనుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. మధ్య దళారుల వద్ద ఎట్టి పరిస్థితులోను విత్తనాలను కొనుగోలు చేయవద్దు.

● పి.శ్రవణ్ కుమార్, జేడీఏ, నల్లగొండ.

'రియల్' కష్టాలు

(5వ పేజీ తరువాయి)



సూర్యాపేట సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం

కనీసం 200 గజాల స్థలం కొనుగోలు చేయాలన్నా సామాన్యుడికి అందుబాటులో ధరలు లేవు. తక్కువలో తక్కువగా గజం రూ.10వేలకు పైగానే పలుకుతుండడంతో సాధారణ పౌరుడు సొంత స్థలం కొనే పరిస్థితి లేకుండాపోయింది. సూర్యాపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రతీ రోజూ కనీసం 100 రిజిస్ట్రేటషన్లు జరగాల్సి ఉండగా ప్రస్తుతం 40 నుంచి 50 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరుగుతున్నాయి. గతంలో రోజూ రూ.70 లక్షల ఆదాయం చలాను ద్వారా లభించేంది. ప్రస్తుతం రోజూ రూ.20 నుంచి 30 లక్షల ఆదాయం మాత్రమే వస్తోంది. నెలకు సుమారుగా రూ.21 కోట్ల ఆదాయానికి రూ.9 కోట్లు వస్తోంది.

ప్రజల్లో హైడ్రా భయం నెలకొంది



హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు జిల్లాపై ప్రభావం చూపుతోంది. ప్రజలు ఏది బఫర్‌జోనో ఏది కాదో తెలియక భూములను కొనుగోలు చేయడంలేదు. రియల్ ఎస్టేట్ చేసే వారు ఫైనాన్స్ తెచ్చి భూములు కొని విక్రయించలేకపోతున్నారు. ఏజెంట్లు ఆదాయం లేక ఇబ్బంది పడుతున్నారు.

- పంతంగి వీరస్వామిగౌడ్, రియల్ ఎస్టేట్ ఏజెంట్.

రిజిస్ట్రేషన్లు తగ్గిన మాట వాస్తవమే


సూర్యాపేటలో గతంలో ప్రతిరోజూ 100కు పైగా రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుతం 40 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరుగుతున్నాయి. ఎందుకు తగ్గాయో కారణం తెలియదు.

● అంబేడ్కర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, సూర్యాపేట.

కల సాకారమయ్యే వేళ.. మృత్యుఒడికి



అంత్యక్రియల్లో పాల్గొన్న తండ్రి వెంకట్‌రెడ్డి



ప్రియాంక(ఫైల్)

- తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు తీసుకొస్తానని అమెరికాకు
- ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా తీవ్ర అనారోగ్యం
- తల్లిదండ్రుల మాట నెరవేరకుండానే మృత్యువాత
- విగత జీవిగా వచ్చిన కుమార్తె పార్థివదేహాన్ని చూసి కన్నీరుమున్నీరు
- పండెనపల్లి గ్రామంలో విషాదఛాయలు

వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఆ యువతి అన్నింటా తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేది. ఉన్నత చదువులు చదివి గ్రామానికి పేరుప్రతిష్ఠలు తీసుకువస్తానని తల్లిదండ్రులకు మాట ఇచ్చింది. డిగ్రీ, పీజీ సైతం తనకు మక్కువైన వ్యవసాయ కోర్సు చేసింది. అమెరికా వెళ్లి ఉన్నత విద్య పూర్తిచేసింది. అనుకున్న లక్ష్యం సాధించిన ఆమె ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా విధి వక్రించింది. తీవ్ర అనారోగ్యానికి గురై అమెరికాలో మృత్యువాత పడింది. తమకు అండగా ఉంటానని మాట ఇచ్చి విగత జీవిగా వచ్చిన కుమార్తె పార్థివదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పండెనపల్లి గ్రామానికి చెందిన కొండి వెంకట్‌రెడ్డి శోభారాణి దంపతుల కుమార్తె ప్రియాంక ది ఈ విషాధ గాధ.

- (ఆంధ్రజ్యోతి, కట్టంగూరు)

పండెనపల్లికి చెందిన కొండి వెంకట్‌రెడ్డి, శోభారాణి దంపతులకు కుమారుడు, కుమార్తె ప్రియాంక (26) ఉన్నారు. వెంకటరెడ్డి గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రియాంక 10వ తరగతి వరకు నకిరేకల్‌లోని ఏవీఎం పాఠశాలలో, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని గాయత్రి కళాశాలలో పూర్తి చేసింది. ఢిల్లీలో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తిచేసి అగ్రికల్చర్ ఎమ్మెస్సీ చేసేందుకు అమెరికాలోని అలబామా రాష్ట్రం యూనివర్సిటీ ఆఫ్ అలబామాలో 2023 సంవత్సరం జనవరిలో చేరింది. పీజీ పూర్తిచేసి పార్ట్‌టైం వర్క్‌చేస్తూ కన్సల్టెంట్ ద్వారా ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. ఈ నెల 4వ తేదీన తండ్రి కొండి వెంకట్‌రెడ్డి అలబామాలో ఉన్న కుమార్తె ప్రియాంకకు ఫోన్ చేయగా, దంత సంబంధిత అనారోగ్యంతో మూడు రోజులుగా అస్వస్థతగా ఉందని చెప్పింది. ఇన్సూరెన్స్ లేకపోవడంతో ఈ అనారోగ్య సమస్య చికిత్సకోసం ఎక్కువ ఖర్చయిందని, ఇన్సూరెన్స్‌కు దరఖాస్తు చేసుకున్నానని చెప్పింది. మరుసటిరోజే ఇన్సూరెన్స్ అప్రూవల్ కాపీని తీసుకుని అక్కడి ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంది. ప్రియాంకను పరీక్షించిన వైద్యులు ఆమెకు బ్లడ్ ఇన్‌ఫెక్షన్ ఉందని, ఆసుపత్రిలో చేరాలని సూచించారు. తాత్కాలికంగా నొప్పి నివారణ కోసం మాత్రలు వేసుకుని స్నేహితుల ఇంటికి వెళ్లింది. భారత కాలమానం ప్రకారం ఈ నెల 6వ తేదీన స్నానం చేసేందుకు వెళ్లిన ప్రియాంక స్నానాల గదిలోనే అకస్మాత్తుగా పడిపోయింది. స్నేహితులు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రియాంకకు క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయని వైద్యులు చెప్పడంతో అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా సమీపంలోని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న ప్రియాంకను పరిశీలించిన వైద్యులు ఆమె బ్రెయిన్‌డెడ్ అయిందని నిర్ధారించారు. మెదడులో రక్తనాళాలు చిట్లి రక్తం మెదడులో వ్యాపించిందని తెలిపారు. వెంటిలేటర్ అమర్చి ఒకరోజు వైద్యం అందించారు. తల్లిదండ్రులు, ప్రియాంక బంధువులతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం అక్కడి వైద్యులు వెంటిలేటర్ తీసివేయడంతో ప్రియాంక ఈ నెల 8వ తేదీన మృతిచెందింది.

2023 మే 7న జరిగిన తన సోదరుడు గణేష్‌రెడ్డి వివాహానికి వచ్చిన ప్రియాంక 18 రోజులు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పాటు ఇక్కడి స్నేహితులతో సరదాగా గడిపింది. అగ్రికల్చర్ ఎమ్మెస్సీ చదివేందుకు మంచి యూనివర్సిటీలో సీటు వచ్చిందని, ఖచ్చితంగా ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల కోరిక నెరవేరుస్తానని చెప్పింది.

ప్రియాంకకు కన్నీటి వీడ్కోలు

ప్రియాంక అంత్యక్రియలు పండెనపల్లిలో బుధవారం ముగిశాయి. అమెరికా నుంచి ప్రియాంక మృతదేహం గ్రామానికి చేరుకున్నాక గ్రామస్థుల సందర్శనార్థం ఆమె ఇంటి వద్ద ఉంచారు. ప్రియాంక మృతదేహంపై పడి తల్లిదండ్రులు రోదిస్తున్న తీరును చూసి గ్రామస్తులంతా కన్నీటి పర్యంతమయ్యారు. ప్రియాంక తమతో ఆప్యాయంగా ఉండే క్షణాలను గుర్తుచేసుకుని గ్రామస్థులు భావోద్వేగం చెందారు. అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర సాగింది. వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. కూతురు ప్రియాంక మృతదేహానికి తండ్రి వెంకట్‌రెడ్డి తల కొరివి పెట్టారు. గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయారు.



పొలం పనుల్లో తండ్రికి చేదోడు వాదోడుగా

ఉన్నత చదువుల కోసం వివిధ రాష్ట్రాలకు వెళ్లి చదివిన ప్రియాంక సెలవు రోజుల్లో స్వగ్రామం పండెనపల్లికి వచ్చి తండ్రితో పాటు పొలం పనులు చేస్తూ చేదోడు వాదోడుగా ఉండేది. తాను ఉన్నత విద్యను అభ్యసిస్తున్నానన్న గర్వం లేకుండా పొలానికి వచ్చిన కూలీలతో కలిసి వరినాట్లు వేసేది. అంతేకాక తానే స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయంగా ఉండేది.

ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల దొంగతనాలు

● కొండమల్లేపల్లి, దేవరకొండలోని ఇళ్లలో చోరీ ● అప్పన్నపేట గ్రామ వేకంటేశ్వరస్వామి ఆలయంలో వెండి కిరీటం అపహరణ

కొండమల్లేపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పట్టపగలే పలు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలకేంద్రంలో బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ రోడ్డులో నివాసముండే ఏరుకొండ రామకృష్ణ బుధవారం ఉదయం తన బంధువుల ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి 100కు ఫోన్ చేశాడు. పోలీసులకు సమాచారం ఇచ్చిన సమయంలో మొదట ఇంటి యజమాని రామకృష్ణ స్థానికులకు, పోలీసులకు 13 తులాల బంగారం, రూ.42వేల నగదు పోయిందని సమాచారం ఇచ్చాడు. పోలీసులు వచ్చాక ఏమీ పోలేదని చెప్పాడు. నల్లగొండ నుంచి క్లూస్ టీం వచ్చి పరిశీలించింది. ఈ విషయమై ఎస్‌ఐ రామ్మూర్తిని వివరణ కోరగా ఎలాంటి చోరీ జరగలేదని తెలిపారు.

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని గాంధీనగర్‌లోని శ్యాంసుందర్‌రావు ఇంట్లో బుధవారం దొంగతనం జరిగింది. శ్యాంసుందర్‌రావు కుటుంబ సభ్యులు ఇంటికి తాళంవేసి మూడు రోజుల క్రితం ఊరెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు అపహరించారు. బుధవారం ఉదయం ఊరినుంచి వచ్చిన శ్యాంసుందర్‌రావు ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించి చోరీ జరిగిందని తెలుసుకొని దేవరకొండ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవరకొండ సీఐ నర్సింహులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేశారు. ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు.

గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామశివారులో ఉన్న పురాతన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గేటు తాళం ధ్వంసం చేశారు. స్థానికులు, ఎస్‌ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడిలోకి ప్రవేశించిన దొంగలు వేంటేశ్వరస్వామి వెండి కిరీటం, సుమారు 15 తులాలుతో పాటు, ఆలయంలోని హుండీ తాళం పగలగొట్టి హుండీలోని సుమారు రూ.10వేలు నగదు ఎత్తుకెళ్లారు. బుధవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన కొందరు మహిళలు రోజు మాదిరిగా మంచినీటి కోసం గుడిలోని బోరు పంపు వద్దకు వెళ్లారు. గుడి తాళం ధ్వంసమై ఉండడదానిన గమనించి ఆలయ పూజారి శ్రీనివాసచార్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పూజారి ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరీక్షా కేంద్రం వద్ద బ్యాగులు, సెల్‌ఫోన్లు మాయం

భువనగిరి టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని పాలిసెట్ పరీక్షా కేంద్రం వద్ద బ్యాగులు, సెల్‌ఫోన్లు, నగదు మాయమయ్యాయి. మంగళవారం జరిగిన పాలిసెట్ 2025 పరీక్ష కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో 296మంది విద్యార్థులకు గాను 284 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. సెల్‌ఫోన్లు, బ్యాగులకు పరీక్షాకేంద్రంలోకి అనుమతి లేకపోవడంతో వెంట తెచ్చుకున్న ఫోన్లు, బ్యాగులను విద్యార్థులు తమ ద్విచక్ర వాహనాల్లోని బ్యాగుల్లో భద్రపరిచి పరీక్షాకేంద్రాల్లోకి వెళ్లారు. పరీక్ష ముగిసాక బైక్‌లలో భద్రపరిచిన సుమారు 16మంది విద్యార్థుల సెల్‌ఫోన్లు, బ్యాగులు వాటిలోని పర్సులు కనిపించలేదు. ఆందోళనకు గురైన విద్యార్థులు పరిసరాల్లో వెతకగా చెట్ల పొదల్లో బ్యాగులు, ఖాళీ పర్సులు కనిపించాయి. విద్యార్థులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

కోదాడ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): పరీక్షా ఫలితాలు ఆశించినట్లుగా రాలేదని తల్లిదండ్రులు మందలించినందుకు బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని గుడిబండ గ్రామంలో బుధవారం జరిగింది. కోదార రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుడిబండ గ్రామానికి చెందిన చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కీర్తి ఉపేందర్ కుమారుడు కీర్తి వివేక్ (20) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ సివిల్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మెదటి సెమిస్టర్ ఫలితాలను మంగళవారం ఆన్‌లైన్‌లో పరిశీలించడగా మూడు సబ్జెక్టులో ఫెయిలయ్యాడు. లక్షలు ఖర్చు చేసి చదివిస్తున్నా, చదువుపై దృష్టి సారించనందున మంచి ఫలితాలు రాలేదని, వేసవి సెలవుకు ఇంటికి వచ్చిన కుమారుడిని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన వివేక్ బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో గుడిబండ గ్రామంలో తన ఇంట్లోని బాత్‌రూంకు వెళ్లి డోర్ పెట్టుకుని కత్తితో మెడ మీద, ఎడమ చేయి మీద కోసుకుని రక్తస్రావమై మృతి చెందాడు. తండ్రి సమయంలో శిక్షణ కోసం సూర్యాపేటకు వె ళ్లాడు. మృతుడి తండ్రి ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోదాడ రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

చౌటుప్పల్ రూరల్: భర్త వేదింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. సీఐ మన్మథ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన భూషిక నవ్య(34) మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చేనేత వస్త్రాలకు వాడే రసాయన ద్రవణం తాగి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. భర్త బాస్కర్, ఆడపడుచు వేధింపులతోనే నవ్య మృతి చెందిందని సోదరుడు రాఘవేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రేమ పేరుతో వేధింపులు.. ఏడేళ్ల జైలు

నల్లగొండ, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని వేధించిన నిందితుడికి కోర్టు ఏడేళ్ల ఆరు నెలల జైలుశిక్ష విధించింది. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నల్లగొండ మండల పరిధిలోని మేళ్లదుప్పలపల్లి గ్రామానికి చెందిన మనిమిద్దె సాయిరాం ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమ పేరుతో వేధించేవాడు. సదరు యువతి స్కూల్‌లో ట్రైయినీ టీచర్‌గా పని చేస్తుంది. 2024 సంవత్సరం ఆగస్టు 8వ తేదీన నిందితుడు ప్రేమ పేరిట వేధించడంతో బాధితురాలు డయల్ 100కు ఫోన్ చేసింది. దీంతో నల్లగొండ రూరల్ పోలీసులు చేరుకునే సరికి సాయిరాం పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో రూరల్ ఎస్‌ఐ సైదాబాబు కేసు నమోదు చేశారు. ఆగస్టు 9వ తేదీన నిందితుడిని అదుపులోకి తీసుకొని అదే రోజు రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరితగతిన విచారణ చేసి సెప్టెంబరు 19న చార్జిషీట్ దాఖలు చేశారు. బుధవారం కేసు విచారించిన ఏడీజే-3, ఫ్యామిలీ కోర్టు నేరం రుజువు కావడంతో నిందితుడికి 7 సంవత్సరాల 6నెలల జైలు శిక్షతో పాటు రూ.8వేల జరిమానా విధించింది. నిందితుడికి బీఎన్‌ఎస్ సెక్షన్ 76 కింద నాలుగు సంవత్సరాల జైలుతో పాటు రూ.వెయ్యి జరిమానా, బీఎన్‌ఎస్ సెక్షన్ 78 కింద రెండు సంవత్సరాల జైలు, రూ. వెయ్యి జరిమానా విధించారు. దీంతో పాటు బీఎన్‌ఎస్ సెక్షన్ 115(2) కింద ఆరు నెలల జైలు, రూ.5వేల జరిమానా, బీఎన్‌ఎస్ సెక్షన్ 351(2) కింద ఒక సంవత్సరం జైలు, రూ. వెయ్యి జరిమానా విధించారు. అన్ని నేరాలు ఏకకాలంలో అమలు చేస్తారని ఎస్పీ తెలిపారు. నేరస్థుడికి శిక్షపడే విధంగా కృషి చేసిన నల్లగొండ రూరల్ ఎస్‌ఐ సైదాబాబు, కోర్టు కానిస్టేబుల్ దుర్గారాజ్, రైటర్ కానిస్టేబుల్ ఆంజనేయులు, సుమన్, శంకర్, రేవతి, నల్లగొండ టూటౌన్ సీఐ రాఘవరావు, డీఎస్పీ శివరాంరెడ్డిని ఎస్పీ అభినందించారు.

ప్రియుడితో కలిసి భర్త హత్య

భువనగిరి టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య. ఆపై ఇరువురూ కలిసి మృతదేహాన్ని 18 కిలోమీటర్ల పాటు ఆటోలో తీసుకవెళ్లి వాగు వద్ద పడేసిన దారుణ ఘటన బుధవారం భువనగిరిలో వెలుగు చూసింది. అయితే ఈ ఘటనలో భార్యను భువనగిరి పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకోగా ప్రియుడు పరారీలో ఉన్నాడు. వివరాల్లోకి వెళితే... వలిగొండ మండలం భీమలింగం కత్వ సమీపంలో బుధవారం ఉదయం ఓ మృతదేహం లభించడం, మృతదేహం మెడ చుట్టూ రక్తపు మరకలు ఉండటంతో సంగెం గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.జితేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వలిగొండ ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మృతుడు భువనగిరి పట్టణం సింగన్నగూడేనికి చెందిన బేర సురేష్ (45)గా తేలింది. దీంతో సమాచారం అందుకున్న భువనగిరి పట్టణ పోలీసులు సింగన్నగూడెంలోని మృతుని ఇంటికి వెళ్లి దర్యాప్తు చేపట్టగా అనుమానాస్పదంగా మాట్లాడిన భార్య మంగను బుధవారం రాత్రి అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. అయితే భర్త సమీప బంధువైన గౌస్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ స్వామితో మంగ అక్రమ సంబంధం నెరపడాన్ని భరించక పలుమార్లు ఆమెను మందలించాడు. ఈ క్రమంలో ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీలో పని చేసే సురేష్ బుధవారం తెల్లవారుజామున విధులకు వెళ్లి ఉంటాడని భావించి స్వామి ప్రియురాలి ఇంటికి రావడంతో ఇరువురు కలియబడ్డారు. ఈ క్రమంలో జరిగిన దాడిలో సురేష్ మృతిచెందాడని భావిస్తున్నారు. సురేష్ మృతదేహాన్ని స్వామి, మంగ కలిసి ఆటోలో భీమలింగం కత్వ సమీపంలోకి తీసుకవెళ్లి పారవేశారు. హత్య జరిగిన సమయంలో సురేష్, మంగల నాలుగేళ్ల కుమార్తె పక్క గదిలో నిద్రిస్తుంది.

వలిగొండ: భువనగిరి పట్టణం సింగన్నగూడెం గ్రామానికి చెందిన బేర సురేష్(45) వలిగొండ మండలం సంగెం గ్రామ శివారులోని భీమలింగం కత్వ వంతెన కింద అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నాడని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి జితేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపారు.

కలిసుంటేనే కలదు సుఖం

● మసకబారుతున్న కుటుంబ వ్యవస్థ ● ఆత్మీయత, బంధాలు ఆమడ దూరం ● నేడు అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం



కుటుంబ సభ్యులందరూ ఒకప్పుడు ఒకే గూడు కింద కుటుంబ పెద్ద అజమాయిషీలో కలిసి మెలిసి ఉంటూ కష్టసుఖాలను కలిసి పంచుకునే వారు. దీంతో ఆ కుటుంబాల్లో సదా ఆనందం వెల్లివిరిసేది. దీంతో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కుటుంబ సభ్యులందరికీ శ్రీరామరక్షగా ఉండేది. కానీ ఆ వసుదైక కుటుంబ వ్యవస్థ పలు కారణాలతో కుచించుకపోతూ ప్రస్తుతం ఓ చిరు కుటుంబం ఏర్పడుతోంది. ఫలితంగా ఉమ్మడి కుటుంబాలతో పోలిస్తే నేటి చిరు కుటుంబాలు సౌకర్యవంతంగా, విలాసంగా జీవిస్తున్నప్పటికీ ఆత్మీయత, మమతాను బంధాలు లోపిస్తున్నాయి. అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని పురస్కరించుకొని కథనం.

● ఆంధ్రజ్యోతి, భువనగిరి టౌన్

కుటుంబమే వ్యక్తి బలం. కుటుంబసభ్యులు ఎక్కువ ఉండే వ్యక్తికి అన్ని రంగాల్లో కాస్త ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుంది. 'మా ఇంట్లో చిన్నపాటి శుభకార్యం జరిగినా.. మా వోళ్లే వంద మంది వరకు వస్తారు' అని గర్వంగా చెప్పుకుంటుండడం పరిపాటి. అలాగే వివాహం తర్వాత కూతురు వేరు కాపురం పెట్టాలనుకునే తల్లిం దండ్రులు కూడా పెద్దింటి సంబంధాలకే ప్రాధాన్యం ఇస్తుండడం సహజం. వ్యాపారాల్లోనూ పెద్ద కుటుంబాలే రాణిస్తుండటం, ఆర్థికంగా బలం ఉండటం చూస్తున్నాం. ముఖ్యంగా పెద్ద కుటుంబాలే అన్ని స్థాయిల రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయి. ఆ కుటుంబ సభ్యుల బంధుత్వ వ్యవస్థ విస్తృతంగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. చిన్న కుటుంబాల సభ్యులతో పోలిస్తే పెద్ద కుటుంబాల సభ్యుల మనోధైర్యం అధికంగా ఉంటున్న పరిస్థితి. దీంతో జీవనం, పోషణ కోసం ఒకే ఊరిలో వేర్వేరుగా ఉంటున్నా, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో స్థిరపడినా మనమందరం ఒకటనే భావనను కుటుంబ సభ్యులందరూ కలిగి ఉంటే లభించే ఆనందం వెలకట్టలేనివి.

కుటుంబ వ్యవస్థ మన సొంతం

కుటుంబం అంటే నేడు తల్లిదండ్రులు, వారి పిల్లలను మాత్రమే. కానీ అనాధిగా భారతీయ కుటుంబ వ్యవస్థలో తాత, నానమ్మ, అమ్మమ్మ, తల్లిదండ్రులు, పెద్దనాన్నలు, కాకలు, పెద్దమ్మలు, చిన్నమ్మలు, అన్నాదమ్ముళ్లు, అక్కచెల్లెళ్లు, మేనమామలు, మేనత్తలు ఇలా గతంలో ప్రతి కుటుంబం గంపెడు మందితో కలకలలాడేవి. నానమ్మ, తాతలు చెప్పే కథలతో పిల్లల్లో మన రామాయణ, మహాభారత ఇతిహాసాలతో పాటు నైతిక విలువలు, గౌరవ మర్యాదలపై అవగాహన, సంస్కారం, అబ్బేవి. కానీ నేటి చిన్న కుటుంబాలతో తల్లిదండ్రులు, ఇరువురు ఉద్యోగాలు, సెల్‌ఫోన్ల బిజీతో పిల్లలకు సమయం ఇవ్వకపోతున్నారు. అదేవిధంగా 2024 తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12.30లక్షల కుటుంబాలు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 4.90లక్షలు, సూర్యాపేట జిల్లాలో 3.90 లక్షలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 3.50 లక్షల కుటుంబాలు ఉన్నాయి.

బలమైన కుటుంబ వ్యవస్థ కోసం..

- పండుగలు, వివాహాలు, పుట్టిన రోజు తదితర ప్రత్యేక రోజుల్లో శుభాకాంక్షలు చెప్పుకోవాలి.
- వివాహాలు జరిగినప్పుడు వీలైనన్ని ఎక్కువ రోజులు కలిసి ఉండి పనులన్నీ సమష్ఠిగా చేసుకోవాలి.
- కుటుంబ పెద్దలు పుట్టిన రోజు, వివాహ దినోత్సవాలను సమష్ఠిగా నిర్వహించాలి.
- సంవత్సరంలో ఎదో ఒక రోజు సమీపంలోని పుణ్యక్షేత్రం లేదా సందర్శనీయ స్థలానికి కలిసి వెళ్లాలి.
- వేసవి సెలవులలో ఒకటి రెండు రోజులు అందరూ కలిసేలా ప్రయత్నించాలి.
- కష్టకాలంలో అండగా నిలవాలి. తమ పరిధిలో ఆర్థిక మద్దతు కూడా ఇవ్వగలిగాలి.
- ఇలా చేస్తే వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పోషణ భారంగా మారకపోగా వృద్ధ శరణాలయాలు కూడా తగ్గుతాయి. ద్వేష భావాలు తగ్గి మమతానుబంధాలు పెరిగి అంతిమంగా సమాజ ప్రగతి, భద్రత, ఐక్యత, గౌరవానికి దోహదపడతాయి.

బంధాలు తెగవద్దు



పరిస్థితులు, కారణాలు ఏవైనప్పటికీ కుటుంబ సభ్యుల మధ్య బంధాలు తెగవద్దు వాటిని కాపాడుకునేందుకు అందరూ సర్దుకుపోవాలి. వ్యక్తిగత అభిప్రాయాలను కుటుంబంపై బలవంతంగా రుద్దవద్దు. ప్రతి నిర్ణయం కలిసి తీసుకుంటే సమస్యలు రావు. విడిగా ఉండే సోదరీ సోదరుల కుటుంబాలు ప్రత్యేక దినాలలో కలసుకోవాలి. తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యతను అందరూ సమష్ఠిగా వహించాలి.

● జె. లక్ష్మమ్మ, భువనగిరి.

బీజేపీ మండల నూతన కమిటీ

చిట్యాలరూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కమిటీని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీక వెంకన్న బుధవారం ప్రకటించారు. ప్రధానకార్యదర్శులుగా గరిషె నరేష్, పున్న విష్ణు, ఉపాధ్యక్షులు గుంటోజు నాగాచారి, ఉయ్యాల లింగస్వామి, గడిగల కోటేష్, నర్ర మాధవి, కార్యదర్శులు రాజేందర్, ఆకుల వెంకన్న, కొర్రబోయిన హేమలత, వరికుప్పల నర్సింహ, కోశాధికారిగా అశోక్‌ను ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు. నూతన కమిటీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వెంకన్న తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

తిప్పర్తి, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలో బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు వంగూరి రవి అన్నారు. బుధవారం బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా నల్లబోతు రమేష్, ఉప్పల శోభారాణి, పాపకంటి సతీష్, చింతరెడ్డి సందీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు నకిరేకంటి మహేష్, ధర్నబోయిన గంగాధర్, కార్యదర్శులు జక్కుల శంకర్, పల్లపు కల్యాణ్, వల్లె మాధవరెడ్డి, మౌనిక, కోశాధికారిగా నాగరాజు, కార్యవర్గసభ్యులను ప్రకటించారు.



ఆస్పత్రిలో శిశువుల స్వీకరణ కేంద్రం ప్రారంభిస్తున్న భాస్కర్, సక్కుబాయి

శిశువుల స్వీకరణ కేంద్రం ప్రారంభం

మర్రిగూడ, మే 14(ఆంధ్రజ్యోతి): మర్రిగూడ సీహెచ్‌సీ ఆస్పత్రిలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఊయల బేబీ రిసెప్షన్ సెంటర్‌ను బాలల సంక్షేమ సమితి సభ్యుడు ఈద భాస్కర్, చింతపల్లి సీడీపీవో సక్కుబాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో తల్లిదండ్రులు తమకు పుట్టిన పిల్లలు భారంగా భావించి శిశువులను చెట్ల పొదల్లో, మురికి కాల్వల్లో వదిలేసి వెళ్తున్నారని అన్నారు. అలా వదిలివేసిన చాలా మంది శిశువులు మరణిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం మిషన్‌వాత్సల్య పథకంలో భాగంగా ఆస్పత్రుల్లో ఊయల సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక దత్తత పేరుతో చిన్నారుల అక్రమ రవాణా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. వీటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం వదిలివేయబడిన చిన్నారుల కోసం ఉయ్యాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఉయ్యాలలో వదిలేసిన చిన్నారులను ఐసీడీఎస్, ఐసీపీఎస్ ద్వారా నల్లగొండ కేంద్రంలో ఉన్న శిశుగృహకు తరలించి అక్కడి నుంచి చట్టబద్ధంగా పిల్లలు లేని వారికి దత్తత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులకు భారమనిపించిన శిశువులను ఊయలలో వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శంకర్‌నాయక్, శాలిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, యశోద, సిబ్బంది ఐసీపీఎస్ సిబ్బంది తేజస్విని, రేవతి, రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



శ్రీహర్షిత్‌ను సన్మానిస్తున్న టీజీ లింగంగౌడ్

చిట్యాలరూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ టీజీ లింగంగౌడ్ అన్నారు. మండలంలోని ఏపూర్ గ్రామానికి చెందిన నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు గోపగోని శ్రీనివాస్, మౌనికల కుమారుడు శ్రీహర్షిత్ నాగార్జునసాగర్‌లోని మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదివాడు. పరీక్షల్లో శ్రీహర్షిత్ అత్యుత్తమ ప్రతిభను చూపి 560 మార్కులను సాధించి పాఠశాలలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు బుధవారం శ్రీహర్షిత్‌ని లింగంగౌడ్ శాలువాతో సన్మానించి తాటిబెల్లంను అందజేసి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత విద్యనభ్యసించాలని ఆకాంక్షించారు.

అమ్మనబోలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నార్కట్‌పల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మనబోలు జడ్పీహెచ్‌ఎస్ 1999-2000 విద్యాసంవత్సరం బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సుమారు 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి తరగతి గది స్మృతులను గుర్తుకు చేసుకుని సరదాగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులను చేసిన ఉపాధ్యాయులు ఏళ్ల కృష్ణారెడ్డి, రాధారపు భిక్షపతి, విఠలాచారి, దొడ్డి యాదయ్య, బొల్ల వెంకట్‌నారాయణ, ఆదిమల్ల వెంకటరాజు, నవీన్, భిక్షమాచారిలను ఘనంగా సన్మానించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

తిప్పర్తి, మే 14(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు నల్లగొండ రైల్వే ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ - రాయినిగూడెం స్టేషన్ల మధ్య ఎఫ్‌సీఐ గోదాంల సమీపంలో సుమారు (45) వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఆయన తెలిపారు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు ఉన్నాడని, శరీరంపై ఆఫ్ తెల్లని బనియన్, బ్రౌన్ కలర్ డ్రాయర్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల ముందు రైలు పట్టాల పక్కన పడి ఉన్నట్లు రైల్వే కీమ్యాన్ ఇచ్చిన సమాచారం మేరకు అక్కడికి చేరుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు 8712658595కి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

కానిస్టేబుల్ గిరిని అభినందించిన ఎస్పీ

● బైక్ దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ చూపినందుకు రివార్డు



గిరికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నార్కట్‌పల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లోని కానిస్టేబుల్ మండలంలోని అక్కెనపల్లి వీపీవో బండి గిరిని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు. నల్లగొండ పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం తన ఛాంబర్‌లో బండి గిరికి ప్రశంసాపత్రం, రివార్డును ఆయన అందజేశారు. స్టేషన్ పరిధిలో చోరీకి గురైన 21 ద్విచక్రవాహన దొంగలను పట్టుకోవడంలో ఆయన ప్రతిభ కనబరిచినందుకు గిరిని ప్రశంసించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎస్పీ చేతుల మీదుగా రివార్డు అందుకుని స్టేషన్‌కు పేరు తెచ్చిన గిరిని సీఐ నాగరాజు, ఎస్‌ఐ క్రాంతికుమార్, సిబ్బంది అభినందించారు.

పల్లె దవాఖానాలపై పట్టింపేదీ?



బోడంగిపర్తి గ్రామంలో ఓ రేకుల గదిలో నిర్వహిస్తున్న పల్లె దవాఖానా

» సొంత భవనాలు లేక ఇబ్బందులు
» ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్న వైనం
» పూర్తిస్థాయిలో అందని వైద్యసేవలు

పేద గ్రామీణ ప్రజలకు వైద్యం చేరువలో ఉండాలనే ఆలోచనతో ప్రభుత్వం పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసింది. కానీ వాటిల్లో సిబ్బందితో పాటు సౌకర్యాలు కల్పించకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది. అద్దె భవనాలు, అరకొర సిబ్బంది వెరసి సరైన వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,చండూరు రూరల్)

ఉమ్మడి చండూరు మండలంలో మొత్తం 10 పల్లె దవాఖానాలు (ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్) ఉన్నాయి. మండలంలోని బంగారిగడ్డ, బోడంగిపర్తి, పుల్లెంల, గుండ్రపల్లి, నెర్మట, చండూరు మునిసిపల్ పరిధిలో రెండు, గట్టుప్పల మండలంలో తేరట్‌పల్లి, గట్టుప్పల మండల కేంద్రంలో రెండు కేంద్రాలను ప్రారంభించారు. వీటిలో రెండు మాత్రమే స్వంత భవనాల్లో నిర్వహిస్తున్నారు. మిగిలిన అన్ని పల్లె దవాఖానాలు అద్దె భవనాల్లో, గ్రామపంచాయతీ ఆవరణలో, కమ్యూనిటీ హాళ్లల్లో నిర్వహిస్తున్నారు. ఈ పల్లె దవాఖానాల్లో ఒక్కో సెంటర్‌కు ఒక (ఎంఎల్‌హెచ్‌పీ) మిడిల్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, ఇద్దరు ఏఎన్‌ఎంలు ఉండాలి. కానీ కొన్ని కేంద్రాల్లో ఒక ఏఎన్‌ఎం లేదా కేవలం ఎంఎల్‌హెచ్‌పీతో నడిపిస్తున్నారు. ఒక వేళ ఉన్న ఒక్కరూ సెలవు పెడితే ఆ రోజు దవాఖానా మూసి వేయాల్సిందే. దీంతో ప్రజలు ప్రైవేట్ ఆర్‌ఎంపీలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో మొక్కుబడిగా ఈ పల్లె దవాఖానాలను నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలకైనా ఇవి తెరుచుకోవడం లేదు.

పల్లెల్లో ప్రజలు ఉదయం 8 గంటలలోపు తమ తమ పనులకు వెళ్తుంటారు. సంబంధిత సిబ్బంది వచ్చేది, పోయేది, పల్లె దవాఖానా అంటూ ఒకటి ఉటుందని కూడా పల్లెల్లో చాలామందికి తెలియని పరిస్థితి. ఒక వేళ ఏదైనా సమస్యతో గ్రామంలో ఉన్న ముసలి ముతక వెళ్లినా దవాఖానాలో ఉండే సిబ్బంది చీదరించుకుని, తిట్టి మరీ పంపిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఈ పల్లె దవాఖానాలపై ప్రత్యేక దృష్టి సారించి పేద గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని కోరుకుంటున్నారు.

అందని మందులు

పల్లె దవాఖానాల్లో ఏదైనా సమస్యతో వస్తే దానికి సంబంధించిన అన్ని మందులు లభించడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతుతన్నారు. సూది ఉంటే మందు ఉండదు. మందు ఉంటే సూది ఉండదు. ఈ రెండు ఉంటే ఒక్కో ఏఎన్‌ఎం, హెల్త్ ప్రొవైడర్‌కు ఇవ్వడానికి మనసురావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో ఉండే ఆర్‌ఎంపీలను ఆశ్రయించి ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. లేకపోతే మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు.

దవాఖానాలో మందులు కరువు

పల్లె దవాఖానాలో అన్ని రోగాలకు ఒకే మందు ప్యారాసిటమల్, యాంటిబయోటిక్ ట్యాబ్లెట్, బి కాంప్లెక్స్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నారు. ఇవి తప్ప వేరొక మందులు దొరకడం లేదు. గ్రామాల్లో ఉండే బీపీ, షుగర్ రోగులకు ప్రతీ నెలా ఇచ్చే మందులు తప్ప మరొకటి లభించదు. గ్రామాల్లో టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు వస్తే ప్రైవేట్ ఆస్పత్రులు లేక ఆర్‌ఎంపీలను కలవాల్సిందే.

పల్లె దవాఖానాల్లో నిత్యం వైద్య సేవలు

మండలంలోని పల్లె దవాఖానాల్లో నిత్యం వైద్య సేవలు అందిస్తున్నాం. మండల కేంద్రంలో లభించే అన్ని మందులు కూడా అక్కడ కూడా లభిస్తాయి. ఇక రక్త, మూత్ర పరీక్షలు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలోనే ఉన్నాయి. దీంతో బాధితులు ఇక్కడకు వచ్చి చేయించుకోవాల్సి వస్తుంది. మండలంలో మొత్తం ఆరు పల్లె దవాఖానాలకు సొంత భవనాలు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియలో ఉన్నాయి. వాటిని త్వరలో పనులు ప్రారంభిస్తాం.

- డాక్టర్ మాస రాజు, మండల వైద్యాధికారి

సరైన మందులు ఉండవు



పల్లె దవాఖానా మా గ్రామంలో ఉందో లేదో అన్నట్లుగా ఉంటుంది. అసలు వాళ్లు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియదు. వారానికి ఒకసారి మాత్రం వస్తారు. గర్భిణులు, పిల్లలకు టీకాలు ఇచ్చి వెళ్తారు. ఈ పల్లె దవాఖానాలో సరైన మందులు ఏవీ ఉండవు. జ్వరం ఎక్కువ వస్తే మళ్లీ చండూరుకు పోవాల్సిందే.

- దాసరి యాదయ్య, నెర్మట

మండల కేంద్రంలోనే రక్త, మూత్ర పరీక్షలు

ఏదైనా సీజనల్ వ్యాధులు, లేక బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి రక్త పరీక్షలు చేయించుకోవాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి. పల్లె దవాఖానాలకు మొక్కుబడిగా బీపీ, షుగర్ టెస్టుల కిట్లు ఇచ్చినా వాటిలో సరైన సమాచారం వస్తుందన్న నమ్మకం లేదు. వీటికోసం ఒక రోజంతా పని వదులుకొని మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి లేదా ప్రైవేట్ ఆస్పత్రులకు జేబులు ఖాళీ చేసుకోవాల్సిందే. ప్రభుత్వం పల్లె దవాఖాలకు సిబ్బందిని ఏర్పాటు చేసి మందులను సరఫరా చేసి బలోపేతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. పల్లె దవాఖానాల్లో సమస్యలను పరిష్కరించాలని, పేదల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రతీ గ్రామంలో పల్లె దవాఖానాను ఏర్పాటు చేసి, అన్ని వసతులతో సొంత భవనాలు నిర్మించి ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు : వీరేశం



నెల్లిబండ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, మే 14 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని నెల్లిబండ గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆ యన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకునేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. నెల్లిబండ గ్రామంలో 44మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులకు సకాలంలో ఇళ్లు నిర్మించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, హౌసింగ్ బోర్డు డీఈ రామనర్సింహారెడ్డి, తహసీల్దార్ జమీరుద్దీన్, ఎంపీడీవో చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి స్వాతి, మాజీ ఉపసర్పంచ్ బొడ్డుపల్లి లక్ష్మణ్, నాయకులు యానాల యాదగిరిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ముస్కు పుల్లయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవచింతనను కలిగి ఉండాలి

చిట్యాలరూరల్: దైనందిన జీవితంలో తీరకలేని సమయాన్ని గడుపుతుంటారని, మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ దైవచింతనను కలిగి ఉండాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని చిన్నకాపర్తి గ్రామపరిధిలోని మొర్సుగూడెంలో వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి బుధవారం ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తిభావం కలిగి ఉంటే ఎలాంటి ఆందోళన ఉండదని దీంతో ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. కుటుంబ సభ్యులతో ఆలయాలను సందర్శించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు సహకరిస్తున్న మోదీ : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్

చిట్యాలరూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు మేలు కలిగించాల్సిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్పొరేట్ శక్తులకు మేలు కలిగించే విధానాలకు పాల్పడుతున్నారని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ విమర్శించారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో బుధవారం జరిగిన పార్టీ గ్రామశాఖ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మత విద్వేశాలను రెచ్చగొడుతూ కులాలు, మతాల నడుమ చిచ్చుపెడుతూ రాజకీయ పబ్బం గడుపుతుందన్నారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి హతమార్చడం దారుణమని, ఇది బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. ప్రజల పక్షాన ఉంటూ దోపిడి రహిత సమాజ నిర్మాణం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు చేస్తుందన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజా సమస్యలపై ప్రశిస్తూ బలమైన ఉద్యమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ మండల కార్యదర్శి ఎండీ అక్బర్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన గుండ్రాంపల్లిలో జరిగే మండల మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం గ్రామశాఖ నూతన కార్యదర్శాన్ని ఏకగ్రీవగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జిల్లా సత్యం, సహాయకార్యదర్శులు కేతరాజు అంజయ్య, సీమ అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా జిల్లా లింగస్వామి, గోపగోని శేఖర్, రత్నం లింగస్వామి, రెడపాక రవి, పానుగుళ్ల శివ, బొబ్బల శంకర్‌రెడ్డి, బెదరకోట సైదులుతోపాటు ప్రజా సంఘాల బాధ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా సమతి సభ్యుడు బొడిగె సైదులు, బొడిగె బక్కశెట్టి జిల్లా యాదయ్య, గోపగోని శేఖర్, లింగస్వామి, స్వామి, అశోక్, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

● వెలిమినేడులో నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యం ప్రారంభం

చిట్యాలరూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం వట్టిమర్తిలో గురువారం ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీడీవో జయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వట్టిమర్తిలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అంతేకాకుండా మండలంలోని వెలిమినేడ గ్రామంలో హైదరాబాద్ నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యాన్ని కూడా ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఆయా కార్యక్రమాలకు అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

ధర్మాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది

కీసర సాయిధామం పీఠాధిపతి రామానంద ప్రభుజీ



చెర్వుగట్టు సోమేశ్వర శివజ్ఞాన పీఠం ఉపనయన మహోత్సవంలో మాట్లాడుతున్న రామానంద ప్రభుజీ

నార్కట్‌పల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): ధర్మాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని కీసరలోని సాయిధామం పీఠాధిపతి రామానంద ప్రభుజీస్వామి అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో గల సోమేశ్వర శివజ్ఞాన పీఠంలో బుధవారం నిర్వహించిన సామూహిక ఉపనయన ఉత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రవచనం చేశారు. హిందువుగా పుట్టిన ప్రతీ ఒక్కరూ విధిగా తమ ధర్మాన్ని నెరవేర్చాలని సూచించారు. ఉపనయనం చేసుకోవడం అంటే మెడలో నాలుగు దారపు పోసలు ధరించడం కాదన్నారు. వేదాలు, శాస్త్రాల్లో ఉపనయనానికి ఎంతో ప్రాశస్త్యం ఉందన్నారు. వైదిక, దైవ కార్యక్రమాల నిర్వహణకు అది తొలి అర్హత అని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 20 మంది ఆదిశైవ బ్రాహ్మణులకు పోతులపాటి రామలింగేశ్వరశర్మ సౌజన్యంతో ఉపనయనం చేశారు.

అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వేడుకలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి దంపతులు, శివజ్ఞానపీఠం అధ్యక్షురాలు పోతులపాటి అరుణ, కోశాధికారి నందనం హరికిషన్‌శర్మ, ఉపాధ్యక్షుడు రాజేందర్‌శర్మ, ధర్మాధికారి జయారపు రామకృష్ణ, చొల్లేటి రామకృష్ణ పార్వతమ్మ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

కంకర మోస్తూ.. కూలీలతో పనిచేస్తూ

● అమరవీరుల స్థూపం నిర్మాణ పనుల్లో వీహెచ్



స్థూపం నిర్మాణానికి కంకర మోస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు

శాలిగౌరారం, మే 14 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల స్థూపం నిర్మాణానికి కంకర మోస్తూ.. కూలీలతో పని చేస్తూ రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హనుమంతరావు అందరినీ ఉత్సాహపరిచారు. మండలంలోని వల్లాల గ్రామంలో జడ్పీ హైస్కూల్‌లో స్వాతంత్ర్య ఉద్యమకారుల జ్ఞాపకార్థం స్థూప నిర్మాణ పనులు చేపడుతుండగా ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం వల్లాల గ్రామంలో 1948లో కొంతమంది స్వాతంత్ర్య ఉద్యమకారులు జాతీయ జెండాను ఎగురవేశారు. అప్పటి నవాబ్ ప్రైవేట్ సైన్యమైన రజాకారులు జెండా ఎగురవేసిన 10మంది గ్రామస్థులను ప్రస్తుత జడ్పీ హైస్కూల్ ఉన్న ప్రదేశంలో కాల్చి చంపారు. వారి చరిత్రను తెలుసుకున్న సీనియర్ నేత హనుమంతరావు మూడేళ్లుగా ఆగస్టు 15వ తేదీన వల్లాల జడ్పీ హైస్కూల్‌కు వచ్చి వారిని చంపిన ప్రదేశంలో మృతులకు నివాళులర్పిస్తున్నారు. ఆ ప్రదేశంలో స్మారక స్థూపాన్ని నిర్మించేందుకు గతేడాది శంకుస్థాపన చేశారు. బుధవారం నిర్మాణ పనులను పరిశీలించిన వీహెచ్ ఇసుక, కంకర, సిమెంట్ ఉన్న తట్ట మోసి అందరినీ ఉత్సాహపరిచారు. కూలీలు తక్కువ కంకర వేయడంతో 'ఇంకా ముసలివాడిని కాలేదు. కంకర ఇంకా వేయండిరా భై' అంటూ తట్ట నిండా కంకర నింపించి నెత్తిపై ఎత్తుకుని పిల్లర్ల గుంతలో వేశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ వల్లాల అమరుల త్యాగాన్ని రాబోయే తరాలకు తెలియజేసేందుకే సొంత వ్యయంతో స్థూపం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 15న స్థూపాన్ని సీఎం, మంత్రులతో కలిసి ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎంఏ బాసిత్, ఇంతియాజ్ అహ్మద్, దండ అశోక్‌రెడ్డి, మాదగోని రామలింగయ్య, నర్సింహ, శ్రీకాంత్ గౌడ్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రాగ్యానాయక్



అడవిదేవులపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా వి.రాగ్యానాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాగ్యానాయక్ గుండ్లపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తుండగా బదిలీపై ఇక్క డికి వచ్చారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీనివాసులు తిరిగి డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

మొక్కలను పరిరక్షించాలి

మిర్యాలగూడ టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): చెట్లు, మొక్కలను పరిరక్షించాలని పర్యావరణ ప్రేమికుడు రావుల శ్రీనివాస్ అధికారులను కోరారు. పట్టణంలోని పలు కాలనీలలో నీరందక మొక్కలు ఎండుతున్నాయన్నారు. వేసవి కారణంగా మంటలు లేసి మొక్కలు, చెట్లు ధ్వంసం అవుతున్నాయన్నారు. మునిసిపల్, అటవీ, అగ్నిమాపక శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

జ్యోతి హాస్పిటల్ మిర్యాలగూడ
JYOTHI HOSPITAL 100బెడ్స్, సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ (NABH)
ఆంజనేయ స్వామి గుడి ప్రక్కన, మిర్యాలగూడ, ఫోన్: 9121212386,
సెల్: 7382028366, 9440165959
ముందు జాగ్రత్తలు తీసుకుంటే గుండెపోటును నివారించగలము.
బి.పి. షుగర్, థైరాయిడ్ సమస్యలు ఆస్తమా, ఉబ్బసం మొదలగునవి.
30సం॥లు దాటి అధిక బరువు ఉన్న వారు చిన్న చిన్న పనులు,
కొద్ది దూరం నడిస్తే ఆయాసం వచ్చే వాళ్లు ఈ క్రింద సూచించిన గుండెకు
సంబంధించిన పరీక్షలు చేయించుకుంటే కొన్ని ప్రమాదాలను నివారించగలరు.



- OP
- ECG
- 2D Echo
- (TMT)
- Serum Creatinine
- Urine Examination test
- Blood Sugar Test
Fasting Blood Sugar
Fasting Urine Sugar
Post Prandial Blood Sugar
RBS, HBA1.C
- LIPID PROFILE
Total Cholesterol
HDL Cholesterol
LDL Cholesterol
VLDL cholesterol
Triglycerides
Total / HDL Cholesterol Ratio
LDL/HDL C.Ratio
- COMPLETE BLOOD PICTURE

మీ గుండెకు అండగా జ్యోతి హార్ట్ ఉందిగా
అన్ని పరీక్షలకు అయ్యే ఖర్చు 5000/- 2000/- మాత్రమే
యాంజియోగ్రామ్ మరియు యాంజియో ప్లాస్టీ చేయబడును
గుండె ప్రాబ్లం ఉన్నవారికి స్టెంటు వేయబడును
24గం॥ గుండె డాక్టర్ అందుబాటులో ఉంటారు.

శ్మశానవాటికకు సాగర్ నీళ్లు

• మిర్యాలగూడ వైకుంఠధామానికి పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు • తీరనున్న ప్రజల కష్టాలు

మిర్యాలగూడ పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శ్మశాన వాటికలో బోరు ఉన్నప్పటికీ, ఆ నీటితో స్నానం చేసే దుస్థితి నెలకొంది. ఇక ప్రాంగణంలో నల్లాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ లోపంతో కుళాయిలు పని చేయకపోవడం, బాత్రూమ్‌లు అపరిశుభ్రంగా ఉంటున్నాయి.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)



షాబూనగర్‌లోని శ్మశాన వాటికలోని బోరు ద్వారా వచ్చే నీటిలో వ్యర్థాలతో పాటు బూడిద ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. దహన సంస్కారాల అనంతరం స్నానం చేసేందుకు ఆ నీటిని వినియోగించుకోలేని పరిస్థితి ఉంది. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు చనిపోయిన సందర్భాల్లో దహన సంస్కారాలు నిర్వహించిన అనంతరం శాస్త్రానికి నీళ్లు చల్లుకుని వెళ్తున్నారు. ఒక వేళ శ్మశాన వాటికలోని బోరు నీటితో స్నానం చేస్తే శరీరమంతా దురదగా ఉంటోందని, బెందులు వస్తున్నాయని వాపోతున్నారు. కాస్తో, కూస్తో పలుకుబడి, స్థోమత ఉన్న వారు బయట నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించుకుంటున్నారు.

నీటితో బెందులొస్తున్నాయి



శ్మశానవాటికలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. అక్కడ లభ్యమయ్యే నీటిలో మలినాలు ఉంటున్నాయి. స్నానం చేసినా, నీరు చల్లుకున్నా బెందులు, దురద వస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి సాగర్ నీళ్లు అందించాలి. బహుళ అంతస్తుల భవనాలకిచ్చే మాదిరిగా ఎక్కువ నీరు సరఫరా చేసే పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి. -బంటు గిరి (స్థానికుడు)

పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు

హిందూ స్మశానవాటికకు సాగర్ వాటర్ అందించేందుకు చర్యలు చేపట్టాం. అవసరానికి తగ్గట్లుగా నీరు సరఫరా అయ్యే విధంగా హెవీ పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నాం. ఇప్పటికే ఎస్టిమేషన్ వేయించాం. అతిత్వరలో శ్మశాన వాటికకు సాగర్ నీరు సరఫరా అవుతుంది.

- వెంకన్న ,మునిసిపల్ ఇంజనీర్, మిర్యాలగూడ

ఉత్తమ వీపీవోగా హనుమానాయక్

• నగదు బహుకరించిన ఎస్పీ



హనుమానాయక్‌ను అభినందిస్తున్న ఎస్పీ

నిడమనూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న హనుమానాయక్ ఉత్తమ గ్రామ పోలీస్ అధికారిగా ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం నల్లగొండలో జరిగిన కార్యక్రమంలో హనుమానాయక్‌ను ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించి, రూ.3వేల నగదు బహుమతి అందజేశారు. తనను ఉత్తమ వీపీవోగా ఎంపిక చేయడం పట్ల ఎస్పీ, మిర్యాలగూడ డీఎస్పీ, హాలియా సీఐ, స్థానిక ఎస్ఐ ఉప్పు సురేష్‌కు హనుమానాయక్ కృతజ్ఞతలు తెలిపారు. s హనుమానాయక్ వెంకటాపురం వీపీవోగా పని చేస్తున్నాడు.

ఆపరేషన్ సిందూర్ దేశ సైనిక శక్తికి నిదర్శనం

చందంపేట, మే 14(ఆంధ్రజ్యోతి): భారతదేశ త్రివిధ దళాల సైనిక శక్తికి ఆపరేషన్ సిందూరు నిదర్శనమని బీజేపీ మండలాధ్యక్షుడు వినోదచారి అన్నారు. మండలంలోని పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జమ్ము కశ్మీర్‌లో ఇటీవల చోటుచేసుకున్న పహల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ ఉగ్రవాదులకు భారతదేశం తగిన బుద్ధి చెప్పిందన్నారు. సమావేశంలో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు పాత్లావత్ అంజనేయులు, వెంకట్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు జెర్సీల పంపిణీ



జెర్సీల పంపిణీలో పాల్గొన్న మాజీ ఎంపీపీ, తదితరులు

కొండమల్లేపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కబడ్డీ క్రీడాకారులకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి సహకారంతో అందజేసిన జెర్సీలను మాజీ ఎంపీపీ రేఖా శ్రీధర్‌రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమలోని క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మంగ్యా నాయక్, యేకుల సురేష్, ఈదయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మిర్యాలగూడ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): వెంకటాద్రిపాలెం సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేస్తున్నందున గురువారం ఉదయం 7 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ ఏఈ అమర్‌సింగ్ బుధవారం తెలిపారు. వెంకటాద్రిపాలెం, ఇండస్ట్రియల్ ఏరియా, శ్రీనివాస్‌నగర్, దుబ్బతండా, తుంగపాడు, నల్లగట్టుతండా, లావూడితండా, సామ్యగాని తండా, టీక్యాతండా, కేశవానగర్ కాలనీ, కొత్తూరు, భాగ్యగోపసముద్రతండా తోపాటు నందిపాడు సబ్‌స్టేషన్‌కు వచ్చే 33కేవీ లైన్‌లో నందిపాడు, ఐలాపురం, చిల్లాపురం, ట్యాంక్‌తండా, కొక్యతండా, మైసమ్మతండాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోగొట్టుకున్న 21 సెల్‌ఫోన్లు అప్పగింత

దేవరకొండ, మే 14(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 21 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఏఎస్పీ మౌనిక తెలిపారు. బుధవారం దేవరకొండ ఏఎస్పీ కార్యాలయంలో బాధితులకు సెల్‌ఫోన్లు అందజేసి మాట్లాడారు. డివిజన్ పరిధిలో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు. దీంతో నిఘా పెట్టిన పోలీసులు 21 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేశారు, సెల్‌ఫోన్ల విలువ రూ.4.59 లక్షల వరకు ఉంటుందని ఏఎస్పీ తెలిపారు. రికవరీ చేయడంలో కీలకపాత్ర పోషించిన సీఐ నర్సింహులు, ఎస్ఐలు అజ్మీర రమేష్, కోటేష్, సిబ్బంది మౌనిక, షేక్ చాంద్‌పాషా, రాజారాం, యాదయ్య, వరలక్ష్మీ, ఇమ్రాన్‌ను ఏఎస్పీ అభినందించారు.

గిరిజనుల సంప్రదాయాలను పరిరక్షించుకుందాం

తిరుమలగిరి(సాగర్), మే 14(ఆంధ్రజ్యోతి): గిరిజనులు తమ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ఏకతాటిపై నిలవాలని మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్ అన్నారు. రంగుండ్ల తండాలో బుధవారం టీఆర్‌జీఎస్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో గిరిజనుల హక్కులు, అభివృద్ధి, సంక్షేమానికి 5వ షెడ్యూల్‌లో పలు ప్రత్యేక నిబంధనలు పొందుపరిచి ఉన్నాయన్నారు. ఈనెల 24,25 తేదీల్లో హాలియా పట్టణంలో నిర్వహించే టీఆర్‌జీఎస్ శిక్షణ తరగతులకు గిరిజన యువత, మేధావులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్, రమావత్ జవహర్‌నాయక్, రమావత్ నరేష్ నాయక్, భాస్కర్‌నాయక్, లాలునాయక్‌పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



బంగారుగడ్డలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

మిర్యాలగూడ టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ యూసుఫ్ హెచ్చరించారు. బుధవారం పలు వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. వ్యర్థాలను మురుగు కాల్వల్లో వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రధాన నాలాల్లో పూడికతీత పను లను మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. ఆయనవెంట శానిటరీ ఎస్సై వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ జావేద్ న్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మాడ్గులపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మాడ్గులపల్లి మండల శివారులో గల భారత్ పెట్రోల్ బంక్ వద్ద బుధవారం జరిగింది. స్థానికులు, ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ మండలం రుద్రారం గ్రామానికి చెందిన గంధం వీరయ్య, నల్లగంతుల రామయ్య (50), కుర్ర మాధవ్, కొండ నాగయ్యతోపాటు మరి కొందరు ట్రాక్టర్‌పై మాడ్గులపల్లి గ్రామ శివారులో గల భారత్ పెట్రోల్ బంక్ వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో మిర్యాలగూడ వైపు వేగంగా వస్తున్న బొలెరో ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై కూర్చున్న వారు కింద పడ్డారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ అయిన గంధం వీరయ్య, నల్లగంతుల రామయ్య తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నల్లగంతుల రామయ్య(50) మృతిచెందాడు. రామయ్య భార్య నల్లగంతుల నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వేసవి శిబిరం ప్రారంభంలో పాల్గొన్న కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి

మిర్యాలగూడ, మే 14(ఆంధ్రజ్యోతి): చిన్నారుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిబిరా లను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు . ఎన్‌వీఆర్ యూత్ ఆధ్వర్యంలో బీఎల్‌ఆర్ బ్రదర్స్ నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాలీబాల్, హ్యాండ్‌బాల్ ఇతర క్రీడలతో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో వ్యాయామం లేకపోవడంతో శరీర దారుఢ్యం, మానసిక చురుకుదనం తగ్గిపోతోందన్నారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను తట్టుకునే పరిస్థితిలో లేకుండా పోతోందన్నారు. క్యాంపులో పిల్లలకు రోజూ పండ్లు పోషకాహారం అందించడం వల్ల ఆరోగ్యం వృద్ధి చెందుతుందన్నారు. పరిసర పిల్లలందరూ సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, మేడ మహేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రవినాయక్, సీనియర్ పీఈటీ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సేవాదళ్ పట్టణ అధ్యక్షుడు అడోత్ అశోక్, కోచ్‌లు నాగరాజు, అశోక్, ఉపాధ్యాయులు కృష్ణకాంత్, వెంకన్న, జగన్‌నాయక్ పాల్గొన్నారు.

దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఊయల ఏర్పాటు



దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఊయలను ప్రారంభిస్తున్న ఏఎస్పీ మౌనిక, ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళ, అధికారులు

దేవరకొండ, మే 14(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఊయల, క్రెడిల్ బేబి రిసెప్షన్ సెంటర్‌ను ఏఎస్పీ మౌనిక, ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన ఆడబిడ్డలు తమకు భారమని భావించినవారు శిశువును ఊయలలో వేయాలని కోరారు. ఇటీవల తల్లి దండ్రులు తమకు భారంగా భావించిన శిశువులను, అనారోగ్యంతో జన్మించిన శిశువులను చెట్ల పొదలలో, మురుగు కాలువలలో వదిలేసి చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకం కింద అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఊయలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవిప్రకాష్, బాలల సంక్షేమ సమితి చైర్మన్ చింత కృష్ణ, శిశుగృహ మేనేజర్ దుర్గాభవాని, డీసీపీయూ సిబ్బంది మందుల వెంకన్న, అంజలి, రమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధ, చిట్టెమ్మ, మేరి, శోభ, విజయలక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు

• చందంపేట వైద్యాధికారి చందులాల్



ఇంటర్వ్యూ Interview

చందంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఉమ్మడి చందంపేట మండల వైద్యాధికారి డాక్టర్ చందు లాల్ తెలిపారు. చందంపేట పీహెచ్‌సీలో 24గంటల వైద్య సేవలు అందిస్తున్నామని బుధవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

(ఆంధ్రజ్యోతి- చందంపేట)

ఆంధ్రజ్యోతి: గ్రామీణ ప్రజలకు పీహెచ్‌సీ ద్వారా ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

వైద్యాధికారి: ప్రజలకు పీహెచ్‌సీ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తూ వైద్యులు, సిబ్బందిని అన్ని వేళల రోగులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గర్భిణులు, బాలింతలకు ఎలాంటి సేవలందిస్తున్నారు?

వైద్యాధికారి : ప్రతి సోమ,శుక్రవారం గర్భిణులు, బాలింతల కోసం 108 ద్వారా రవాణా సౌకర్యం కల్పిస్తూ వారికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పీహెచ్‌సీలో 24 గంటలు విధులు నిర్వహిస్తున్నారా?

వైద్యాధికారి : 24గంటలు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా?

వైద్యాధికారి : దాదాపుగా అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. పాము, కుక్క కాటుకు కూడ అవసరమైన మందులు పీహెచ్‌సీలో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: ఉమ్మడి మండలంలో ఉపకేంద్రాల పనితీరు ఎలా ఉంది?

వైద్యాధికారి : ఉమ్మడి చందంపేట మండలంలో 14 ఉప కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో ఏఎన్ఎంను అందుబాటులో ఉంచుతూ వైద్యసేవలు అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఆసుపత్రుల్లో ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు?

వైద్యాధికారి : ప్రస్తుతం 24 గంటల స్టాఫ్ నర్సు కొరత ఉంది. కంబాలపల్లిలో ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉంది. నేరేడుగొమ్ములో కొత్తగా పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే మారు మూల ప్రాంతాల ప్రజలకు 24గంటలు మరింత మెరుగైన వైద్య సేవలు అందించవచ్చు.

రంగమ్మ కుటుంబానికి మండలి చైర్మన్ పరామర్శ



రంగమ్మ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

మాడ్గులపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పోరెడ్డి వెంకటిరెడ్డి తల్లి రంగమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ బుధవారం గ్రామానికి చేరుకొని రంగమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట తహసీల్దార్ సురేష్, ఇన్‌చార్జి ఆర్ఐ నాగయ్య తదితరులు ఉన్నారు. వెంకట్‌రెడ్డి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వద్ద పీఏగా పనిచేస్తున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



ఎంపీడీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

దేవరకొండ, మే 14(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మం జూరు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహులు డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయ అధికారి లతీఫ్‌కు బుధవారం వినతిపత్రం అందజేసి వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అర్హు లకు ఇందిరమ్మ ఇళ్లు అందడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పినవారికే ఇళ్లు మం జూరు చేస్తున్నారని ఆరోపించారు. వినతిపత్రం అందజేసినవారిలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండాల అంజయ్య యాదవ్, చండీశ్వర్, రెడ్డిశంకర్, ఇడెం రవి, అంజి, రవీందర్, శంకర్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకోవాలి



సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను సంఘటితంగా అడ్డుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రాంమూర్తి అన్నారు. బుధవారం రైస్‌మిల్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేసి కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఐక్య ఉద్యమాల ద్వారానే కార్మికుల హక్కులను కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. ఈనెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు సంఘటిత, అసంఘటిత రంగాల్లో కార్మికులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి ఉత్పత్తి, రవాణా రంగాన్ని స్తంభింపచేసి ప్రభుత్వానికి తీవ్ర నిరసన తెలియజేయాలని కోరారు. సమ్మెలో భాగంగా స్థానిక సుందరయ్య పార్క్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నార కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణకు గురికాకుండా చర్యలు

మాడ్గులపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుగుల గ్రామ చెరువు కబ్జాకు గురికాకుండా చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ సురేష్ తెలిపారు. బుధవారం కబ్జాకు గురైన చెరువును ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇటీవల గ్రామానికి చెందిన పలువురు రైతులు చెరువును కొందరు కబ్జాకు పాల్పడుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు చెరువును ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. సర్వేయర్లతో చెరువుకు హద్దులు నిర్ణయించి కబ్జాకు గురి కాకుండా చర్యలు చేపడ్తామన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఆర్ఐ నాగయ్య, ఉన్నారు.

వ్యవసాయ అధికారుల కొత్త ఫోన్ నంబర్లు

మిర్యాలగూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు ఏడీఏ దేవ్‌సింగ్ తెలిపారు. మిర్యాలగూడ ఏడీఏ నంబర్ 8977751358, మిర్యాలగూడ ఏవో 8977750368, అడవిదేవులపల్లి ఏవో 8977751360, దామరచర్ల ఏఓ 8977751366, మాడ్గులపల్లి ఏఓ 8977751367, వేములపల్లి ఏఓ 8977751369 నంబర్లకు ఫోన్ చేసి సాగుకు సంబంధించి తగిన సాయం, సూచనలు పొందాలని కోరారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

నిడమనూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలంలోని సోమారిగూడెంలో లోవోల్టేజీ నివారణ కోసం ఏర్పాటు చేసిన కొత్త ట్రాన్స్‌పార్మర్‌ను బుధవారం టీపీసీసీ యూత్ రాష్ట్ర కార్యదర్శి యడవల్లి వల్లభ్‌రెడ్డి, మేరెడ్డి వెంకట్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యను పూర్తిగా నివారించేందుకు ప్రభుత్వం పలు గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేస్తుందన్నారు. అనంతరం నూనె ఎల్లయ్యకు మంజూరైన రూ.24వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో నాయకులు కొండా శ్రీనివాస్‌రెడ్డి, శివమారయ్య, నర్సింగు విజయ్, చెర్క శ్రీను, బసప్ప, పురుషోత్తంరెడ్డి, జైపాల్‌రెడ్డి, అంజయ్య, రామలింగయ్య, రాజు, రమేష్, స్వామి, మహేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు